మహబూబ్‌నగర్ వార్త
నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగులాంబ గద్వాల / నారాయణపేట

మోడీ సర్కార్ దుర్మార్గపు చర్య..!

- కక్షసాధింపు ధోరణి సరికాదు..- రాహుల్ పార్లమెంట్ సభ్యత్వ రద్దు అప్రజాస్వామ్యం

- మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ నేత ఎర్రశేఖర్

మహబూబ్‌నగర్ ప్రతినిధి, మార్చి 25, ప్రభాతవార్త: ఏఐసీసీ అధినేత రాహుల్ గాంధీపై కేసు పెట్టడం అరాచకం, అప్రజాస్వామికమని మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ నేత ఎర్రశేఖర్ అన్నారు. జడ్చర్ల మండల కేంద్రంలోని ఆయన స్వగృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎన్నో ఏండ్లు దేశానికి సేవ చేసి దేశం కోసం రక్తం చిందించిన కుటుంబం వారిదని గుర్తుచేశారు. ప్రజా సేవకు వారి కుటుంబాన్ని అంకితం చేసిన అలాంటి వారిపై కేసులు పెట్టడాన్ని సామాన్యులు సైతం హర్షించడం లేదన్నారు. కనీసం ముందస్తు చర్యలు లేకుండా కేసుకు ఇంకా సమయం ఉన్నా అధికారం ఉందనే ఇష్టారీతిగా కేసులు పెట్టడం సరికాదన్నారు. 2019లో మోడీ ఇంటి పేరుపై వ్యాఖ్యలు చేస్తే ఇప్పుడు కేసులు పెట్టడమే కాకుండా లోక్‌సభలో ప్రధాన ప్రతిపక్షానికి చెందిన ముఖ్య నేత రాహుల్‌గాంధీపై అనర్హత వేటు వేయడం ఎంతవరకు సమంజసమన్నారు. జోడో యాత్రలో దేశవ్యాప్తంగా రాహుల్ గాంధీకి ఉన్న క్రేజ్‌ను చేసి ఓర్వలేకే ఇలా చేస్తున్నారని ఆరోపించారు. పరువు నష్టం దావా అమలు చేసే సమయం ఉన్నా కూడా కక్ష పూరిత ధోరణితో వ్యవహరించడం సరికాదన్నారు. సభ్యత్వ రద్దు నిర్ణయం వెనక్కి తీసుకోవాలనని డిమాండ్ చేశారు. లేని యెడల ఆందోళనలు చేస్తామన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే ఎర్రశేఖర్

ఆదర్శ గ్రామపంచాయితీలకు జిల్లా స్థాయి జాతీయ స్థాయి అవార్డుల ప్రధానోత్సవం..

గ్రామాల అభివృద్ధి కొరకు సర్పంచులు, కార్యదర్శులు మరింత కృషి చేయాలి..

రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి..

వనపర్తి ప్రతినిధి,మార్చి 25 ప్రభాతవార్త: గ్రామ స్వరాజ్య పాలనలో తెలంగాణ రాష్ట్రం దేశంలోనే ముందంజలో ఉందని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి అన్నారు. శనివారం ఐడీఓసీ సమావేశ మందిరంలో దీన్ దయాల్ ఉపాధ్యాయ పంచాయితీ సతత వికాస్ పురస్కార్ అవార్డుల ప్రధానోత్సవం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి మంత్రి, జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ తో కలిసి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జ్యోతి వెలిగించి అవార్డుల ప్రధానోత్సవ కార్యక్రమాన్ని వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ దేశంలోనే తెలంగాణ రాష్ట్రం అవార్డులలో 1వ స్థానం దక్కించుకుందని తెలిపారు. వనపర్తి జిల్లాని అన్నిరంగాల్లో అభివృద్ధి సాధించడానికి అధికారులు కృషి చేయాలన్నారు. గత 9 ఏళ్ల లో తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తుందని మంత్రి తెలిపారు. చాలా రాష్ట్రాల్లో కనీసం టాయిలెట్స్ కూడా లేని పరిస్థితి నెలకొందన్నారు. కోవిడ్ సమయంలో జిల్లా యంత్రాంగం పంచాయితీ సిబ్బంది, వైద్య ఆరోగ్య శాఖ ఎంతో కృషి చేసిందని గుర్తు చేశారు. సర్పంచులు, కార్యదర్శులు ప్రణాళికబద్ధంగా ముందుకు పోవాలని సూచించారు. కేంద్ర అవార్డులలో తెలంగాణాకు 19 అవార్డులు దక్కాయని మనం దానికి గర్వపడాలని అన్నారు. మనం ముందున్నామని జిల్లా స్థాయి నుండి రాష్ట్రస్థాయి జాతీయ స్థాయి వరకు అవార్డులు పొందవచ్చునని మంత్రి తెలిపారు. ఈ సందర్భంగా 27మంది అవార్డులు పొందిన వారికి ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు.

జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ మాట్లాడుతూ గత సంవత్సరం చేసిన కృషికి ఫలితంగా 27గ్రామపంచాయితీలలో జాతీయ స్థాయిలో అవార్డులు రావడం అభినందనలు అని అన్నారు. ఈ కార్యనరకమంలో పేదరిక నిర్మూలన ఆరోగ్యరమైన పిల్లల స్నేహపూర్వక మహిళ స్నేహపూర్వక క్లీన్ అండ్ గ్రీన్ సూపర్ పాలన, నీటి సమృద్ధి సామాజిక భద్రత వంటి 9అంశాలలో ఎంపిక చేసిన గ్రామపంచాయితీలకు ప్రథమ, ద్వితీయ బహుమతులు గ్రామ సర్పంచులు, గ్రామ కార్యదర్శులకు షీల్డ్, శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వేణుగోపాల్, జడ్పీ చైర్మెన్ లోక్‌నాథ్ రెడ్డి, జడ్పీ వైస్ చైర్మెన్ వామన్ గౌడ్, ఆర్డీఓ పద్మావతి, జడ్పీ సీఈఓ శ్రవణ్ కుమార్, డీపీఓ సురేష్, మున్సిపల్ వైస్ చైర్మెన్ వాకిటి శ్రీధర్, సర్పంచులు, పంచాయితీ కార్యదర్శులు, ఎంపీపీ లు, జడ్పీటీసీ లు, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అవార్డులు అందజేస్తున్న మంత్రి నిరంజన్ రెడ్డి, కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్

రేషన్ డీలర్ల నోటిఫికేషన్ రద్దు చేయాలి..

అధికార పార్టీ ఏజెంట్‌గా మారిన నారాయణపేట ఆర్డీఓ..!

రేషన్ డీలర్ల నియామక ఇంటర్వ్యూ మార్కుల్లో గోల్‌మాల్

ఎమ్మెల్యే సిఫారసు ఉన్న వారికే డీలర్ పోస్టులు

బీఎస్పీ నారాయణపేట నియోజకవర్గ ఇంచార్జి బొబిగెలి శ్రీనివాస్

మాట్లాడుతున్న బీఎస్పీ నాయకులు

నారాయణపేట ప్రతినిధి,మార్చి 25 ప్రభాతవార్త : నారాయణపేట ఆర్డీఓ అధికార పార్టీ ఏజెంటుగా మారారని బీఎస్పీ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి శ్రీనివాస్ ఆరోపించారు. శనివారం మరికల్ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రేషన్ డీలర్ల నియామకాల్లో అర్హత సాధించిన వ్యక్తులకు కాకుండా ఎమ్మెల్యే సిఫారసు చేసిన వారికి ప్రాధాన్యత ఇస్తూ ఇంటర్వ్యూలలో మార్కులలో గోల్‌మాల్ చేసి అర్హులైన అభ్యర్థులకు తీవ్రమైన అన్యాయం చేశారని మండిపడ్డారు. లక్షల్లో ముడుపులు తీసుకుని అధికార పార్టీ నాయకులు డీలర్ల నియామకాల్లో చక్రం తిప్పారని ఆరోపించారు. ఒక ప్రభుత్వ అధికారి రాజకీయ పార్టీ నాయకుల కనుసన్నల్లో పని చేయడం సిగ్గుచేటన్నారు. డీలర్ల నియామకాలు పారదర్శకంగా జరిపించాల్సింది పోయి రాజకీయ నాయకుల సిఫారసులను ఆమోదించడం ఏంటని ప్రశ్నించారు. తక్షణమే రేషన్ డీలర్ల నోటిఫికేషన్ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు చంద్రయ్య, మండల ప్రధాన కార్యదర్శి చెన్నయ్య, కార్యదర్శి వెంకటయ్యయాదవ్, బీఎస్పీ నాయకులు అశోక్, బాల్‌చందర్ పాల్గొన్నారు.

ప్రకృతి వైపరిత్యాలు సంభవించినప్పుడు ఆదుకునేలా ప్రతి ఒక్కరూ సన్నద్ధంగా ఉండాలి..

వనపర్తి ప్రతినిధి,మార్చి 25 ప్రభాతవార్త: ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు ఆదుకునేలా ప్రతి ఒక్కరు సన్నద్ధంగా ఉండాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అన్నారు. శనివారం పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో ఎన్‌డీఆర్‌డీఎఫ్ జాతీయ విపత్తుల నివారణ సంస్థ జిల్లా స్థాయి సీబీఆర్‌ఎన్ మాక్ ఎక్సైజ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అవేర్నెస్ ప్రదర్శనలో ఎస్పీ, ఏఎస్పీ, డీఎస్పీ జిల్లా అధికారులు, ప్రజలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ ఎఫ్ బృందాలు విపత్తుల నిర్వహణలు ఎదుర్కోవాల్సిన అంశాలను ప్రదర్శన ద్వారా అవగాహన కల్పించారు. ఫైర్ డిపార్ట్మెంట్ ద్వారా డెమో అలాగే సీపీఆర్ నిర్వహించి మనిషిని ఎలా కాపాడాలో ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో టీం కమాండర్ దామోదర్ సింగ్, ఎన్‌డీఆర్‌ఎఫ్ ఇన్స్పెక్టర్ గోపాల్, మీన ఆధ్వర్యంలో జరిగాయి. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మెన్ గట్టు యాదవ్, వైస్ చైర్మెన్ వాకిటి శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.

సీపీఆర్ చేసే విధానాన్ని చూయిస్తున్న ఎన్టీఆర్ఎఫ్ బృందం

ఐదవ శక్తిపీఠం అలంపూర్ శ్రీ జోగులాంబ బాలబ్రహ్మేశ్వర దేవాలయ అభివృద్ధి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ వల్లూరుక్రాంతి

అలంపూర్,మార్చి25 ప్రభాతవార్త: గద్వాల జిల్లా అలంపూర్‌లో శనివారం ఐదవశక్తిపీఠంప్రసాద్ స్కీం కింద జరిగే అభివృద్ధి పనులను పరిశీలించి, త్వరిత గతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. పనులను పరిశీలించారు. ఈ మేరకు ఆమె ముందుగా అలంపూర్ నవబ్రహ్మ ఆలయాల దగ్గర ప్రసాద్ స్కీం కింద చేపట్టాల్సిన ప్రహరీగోడ నిర్మాణానికి ఏర్పడుతున్న ఇబ్బందుల గురించి అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా పార్కింగ్ స్థలం దగ్గర నుండి సమీపంలోని గ్రామంలో ఉన్న ప్రభుత్వ స్థలాన్ని పరిశీలించారు. నవ బ్రహ్మాలయాల పార్కింగ్ స్థలంలో భక్తులు సేదతీరేందుకు పబ్లిక్ ఎమినిట్ సెంటర్ నిర్మాణం చేసేందుకు అనుమతి ఇప్పించాలంటూ ఆలయ ఇఓ పురందర్‌కుమార్ జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. వెంటనే సంబంధిత ఆర్కియాలజికల్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ రోహిణితో మాట్లాడుతూ దేవస్థానంకు సంబంధించి సంబందిత పూరాతత్వ శాఖ వారికి లేఖ రాసి డైరెక్టర్ జనరల్‌తో అనుమతులు తీసుకోవాల్సి ఉంటుందంటూ సమాధానం ఇచ్చారు. అనంతరం పార్కింగ్ టైల్స్, ఐమాక్స్ లైట్స్ ఏర్పాటుకు వస్తున్న ఇబ్బందుల గురించి అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా పర్యాటక ప్రదర్శనశాలను జిల్లా కలెక్టర్ సందర్శించి అక్కడ విగ్రహాన్ని తిలకించారు. వాటి చారిత్రక విశేషాలు ఆలయ అసిస్టెంట్ రంగనాథ్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి సంజీవనాయడు వివరించారు. అన్నదాన సత్రం స్థల పరిశీలన, దేవాదాయ మ్యూజియం పరిశీలన అప్రోచ్ రోడ్డుకు సంబంధించి ఆక్రమణకు గురైన నివాస స్థలాన్ని పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు.

అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న కలెక్టర్

కార్యకర్తలకు అండగా ఉంటా..!

- **24గంటలు ప్రజా సేవలోనే..**
- **ఏ సమస్య వచ్చినా నాకు చెప్పండి..నేనున్నా**
- **పార్టీ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి : పర్యాటక శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్**

మహబూబ్‌నగర్ ప్రతినిధి, మార్చి 25, ప్రభాతవార్త : కార్యకర్తలకు అనునిత్యం అండగా ఉంటానని, ఎప్పుడు ఏ ఆపద వచ్చినా అన్న ఉన్నాడనే ధైర్యంతో ఉండాలని పర్యాటక, ఎక్సైజ్ శాఖ మంత్రి వీ శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని భూత్పూర్ రోడ్డులోని మంత్రి క్యాంప్ కార్యాలయలంలో బీఆర్ఎస్ పార్టీ ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాటాడారు. 24గంటలు ప్రజలకు అందుబాటులో ఉండి సేవ చేస్తున్నా..వార్డు పర్యటనల ద్వారా స్థానిక సమస్యల పరిష్కారానికి కృచేస్తున్నామన్నారు. ఎవరికీ ఎప్పుడు ఏ ఆపద వచ్చినా తనకు చెప్పండని, ఏ అర్ధరాత్రి అయినా తాను స్పందిస్తానన్నారు. ధర్మంవైపు ఉండాలనే ఇతర పార్టీల నాయకులు బీఆర్ఎస్‌లో చేరేందుకు ఆసక్తి చూపుతున్నారని పేర్కొన్నారు. సమైక్య రాష్ట్రంలో తీవ్ర అన్యాయానికి గురైనామని, ఇప్పుడిప్పుడే అభివృద్ధి బాట పడుతున్నామన్నారు. మహబూబ్‌నగర్‌ను మరింత అభివృద్ధి చేసుందుకు అహర్నిశలు కృషి చేస్తానన్నారు. కార్యకర్తలు, నాయకులు చేసిన అభివృద్ధిని, ప్రభుత్వ సంక్షేమ పథకాలను ఎప్పటికప్పుడు ప్రజలకు చేరవేయాలని కోరారు. అభివృద్ధిని ఊసి ఓర్వలేకే కాంగ్రెస్, బీజేపీ నాయకులు కాలుష్యం పేరిట కుట్రలు చేస్తున్నారన్నారు. ఈ ప్రాంత భవిష్యత్తు, మన బిడ్డల రేపటి భవితను నిర్ణయించే ఐటీ లిథియం గిగా సెల్ పరిశ్రమను అడ్డుకోవడం ఎంత వరకు సమంజసమన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్

కార్యకర్త ఇందిర కుటుంబానికి భోజనం వడ్డిస్తున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్

కార్యకర్త కుటుంబంతో కలిసి భోజనం..

క్యాంప్ కార్యాలయంలో జరిగిన ఆత్మీయ సమ్మేళనానికి పట్టణానికి చెందిన బంజారా కాలనీకి చెందిన ఇందిర అనే కార్యకర్త సమావేశంలో ప్రసంగించి తన ఆర్థిక పరిస్థితిని గురించి వివరించింది. ఆమె ఆర్థిక పరిస్థితికి చెలించిన మంత్రి అన్ని విధాలా ఉంటామని హామీ ఇచ్చారు. ఇందిరతోపాటు ఆమె కొడుకు, కూతురుతో కలిసి భోజనం చేశారు. మంత్రి స్వయంగా వడ్డించి సొంత అన్నలా ఆదరించారు. పిల్లలకు సైతం భోజనం వడ్డించి, అన్నలా అండగా ఉంటానని ధైర్యం చెప్పారు. తానే స్వయంగా వచ్చి సమస్యలను తెలుసుకుని పరిష్కరిస్తామని భరోసానిచ్చారు. దీంతో ఇందిర మంత్రికి కృతజ్ఞతలు తెలిపింది. అనంతరం హన్వాడ మండల కేంద్రంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల రెండో వార్షికోత్సవ వేడుకలకు మంత్రి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జ్యోతి ప్రజ్వళన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అంతకముందు కోయిలకొండ మండలం కొత్లాబాద్‌కు చెందిన రేషన్ డీలర్ వెంకటరాములు గౌడ్ అనారోగ్యంతో మృతిచెందగా శనివారం వారి నివాసానికి వెళ్లి మృతుడి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

మిల్లెట్స్ విక్రయాలకు శిల్పారామంలో ప్రత్యేక స్టాల్

మిల్లెట్ ఉత్సవం 2023 ప్రారంభోత్సవంలో మంత్రి శ్రీనివాస్‌గౌడ్

ఆహార అలవాట్లు మార్పుల కారణంగా ప్రపంచ వ్యాప్తంగా చిరుధాన్యాలకు విశేషమైన ప్రాధాన్యం లభిస్తోందని భవిష్యత్తులో ఈరంగానికి మంచి డిమాండ్ ఉండబోతుందని ఎక్సైజ్‌శాఖ మంత్రి డా.వి. శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. మిల్లెట్స్ పండిస్తున్న రైతులకు సరైన మార్కెటింగ్ సౌకర్యం ఉండేలా బాధ్యతను కూడా అధికారులు తీసుకోవాలని ఆయన సూచించారు. స్థానిక జడ్పీ గ్రౌండ్స్‌లో ఏర్పాటు చేసిన మిల్లెట్ ఉత్సవం 2023 ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజైన మంత్రి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.

స్టాళ్లను పరిశీలిస్తున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్

అనంతరం దేశ వ్యాప్తంగా వివిధ ప్రాంతాల నుండి ఏర్పాటు చేసిన మిల్లెట్స్ స్టాల్స్‌ను మంత్రి పరిశీలించారు. మిల్లెట్స్ ఉత్పత్తులకు ఉన్న ప్రాధాన్యాన్ని గుర్తించి త్వరలో ప్రారంభమయ్యే శిల్పారామంలో అన్ని రకాల మిల్లెట్స్ ఉత్పత్తులు లభించేలా ఒక స్టాల్ ఏర్పాటు చేయనున్నట్లు మంత్రి వివరించారు. ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల స్థాపనకు ముందుకు వచ్చే వారికి ప్రభుత్వం గరిష్టంగా రూ. 10 లక్షల రాయితీ ఇవ్వనున్నందున యూనిట్ల స్థాపనకు ముందుకు వచ్చే ఔత్సాహిక యువకులు, రైతులను ప్రోత్సహించాలన్నారు. వివిధ ఆహార ఉత్పత్తులు తయారు చేసి జీవించే మహిళా సంఘాలకు గత ఏడాది సుమారు రూ. 18.50 కోట్ల వడ్డిలేని రుణాలను అందించినట్లు మంత్రి ఈ సందర్భంగా వెల్లడించారు. కార్యక్రమంలో ఫుడ్ ప్రాసెసింగ్ ఇండస్ట్రీస్ డైరెక్టర్ డి. ప్రవీణ్, డిప్యూటి డైరెక్టర్ అభయ్, సివిసి మిల్లెట్స్ సీఈఓ అనిలాకుమారి, ఆకాంక్షశర్మ, సుష్మ, మున్సిపల్ కమిషనర్ ప్రదీప్‌కుమార్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వెంకటేష్, పరిశ్రమల శాఖ జిఎం బాబు రావు, మెప్మా రాష్ట్ర కో ఆర్డినేటర్ ప్రసన్నకుమార్, అదనపు డిఆర్‌డిఓ శారద తదితరులు పాల్గొన్నారు.

నీచ రాజకీయాలకు పాల్పడుతున్న బీజేపీ ప్రభుత్వం..

నాగర్‌కర్నూల్ ప్రతినిధి,మార్చి 25 ప్రభాతవార్త: కాంగ్రెస్ పార్టీ భావి భారత ప్రధాని రాముల్‌గాంధీపై అనర్హత వేటుతో పాటు మెంబర్ ఆఫ్ పార్లమెంట్ పదవి నుంచి అన్యాయంగా తొలగించడం హేయమైన చర్య అని మాజీ మంత్రి నాగం జనార్ధన్‌రెడ్డి కేంద్ర ప్రభుత్వ తీరుపై మండిపడ్డారు. జిల్లా కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ పిలుపుమేరకు మోడీ దిష్టిబొమ్మను దగ్ధం చేసి అక్కడి నుంచి భారీ ర్యాలీగా కలెక్టరేట్ ముందు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మహాధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ విష ప్రయోగాన్ని చిమ్ముతూ భారత్ జోడోయాత్రలో రాహుల్‌గాంధీకి దేశంలోని నలుమూలల నుంచి వచ్చిన ప్రజాధరణ వచ్చిన విషయాన్ని దృష్టిలో పెట్టుకొని బీజేపీ ప్రభుత్వం ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడుతుందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు బాల్‌గౌడ్, అర్థం రవి, పాండు, కోటయ్య, లక్ష్మయ్య, వెంకట్‌రాంరెడ్డి, శ్రీనివాసులు, నిజామొద్దిన్, సురేంద్ర, సుల్తాన్, రాము, అవినాష్‌గౌడ్ ఉన్నారు.

కల్వకుర్తిలో... కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రాహుల్ గాంధీపై అనర్హత వేటు బీజేపీ ప్రభుత్వానికి సిగ్గుచేటని బ్లాక్ కాంగ్రెస్ పార్టీ విజయ్‌కుమార్‌రెడ్డి అన్నారు. కల్వకుర్తి పట్టణంలోని పాలమూరు చౌరస్తాలో మోడీ దిష్టిబొమ్మను కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో దగ్ధం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాహుల్‌గాంధీ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భారత్ జోడో యాత్రకు వచ్చిన స్పందనను చూసి ఓర్వలేకనే బీజేపీ ప్రభుత్వం ఇలాంటి నీతిమాలిన పనులకు పాల్పడుతుందని, ప్రజాస్వామ్యంలో ప్రశ్నించే గొంతును నొక్కి బీజేపీ ప్రభుత్వం నీచ రాజకీయాలు చేస్తుందని, దొంగలకు సద్దులు కడుతున్న బీజేపీ ప్రభుత్వాన్ని పారదోలడానికి కాంగ్రెస్ పార్టీ శ్రేణులు సిద్ధంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో కల్వకుర్తి పట్టణ అధ్యక్షులు చిమ్ముల శ్రీకాంత్‌రెడ్డి, తర్నికల్ గ్రామ సర్పంచ్ పాండు గౌడ్, కాంగ్రెస్ నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, ఆంజనేయులు, వంశీ, ఉదయ్, మహమూద్, షాకేర్, కమృద్దిన్, రఫి, ఖదీర్, అరీఫ్, అనిల్, బాలరాజు, బండి సుదర్శన్, పాండు, ఆంజనేయులు, గణేష్, శ్రీకాంత్, మహేష్‌గౌడ్, సంతోష్, రవికుమార్, శంకర్‌నాయక్ తదితరులు ఉన్నారు.

వెల్దండలో మోడీ దిష్టిబొమ్మ దగ్ధం చేస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

కల్వకుర్తిలో మోడీ దిష్టిబొమ్మ దగ్ధం చేస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

వెల్దండలో... కాంగ్రెస్ అగ్రనేత, లోకసభ సభ్యులు రాహుల్‌గాంధీ సభ్యత్వాన్ని రద్దు చేయడం ప్రజాస్వామ్యానికి చీకటి రోజు అని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మోతిలాల్‌నాయక్ అన్నారు. వెల్దండ మండల కేంద్రంలోని హైదరాబాద్-శ్రీశైలం జాతీయ ప్రధాన రహదారిపై శనివారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ప్రధాని మోడీ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాహుల్‌గాంధీ లోకసభ సభ్యత్వాన్ని పునరద్ధరించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు పర్వత్‌రెడ్డి, మట్ట వెంకటయ్యగౌడ్, మధుసూదన్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, రషీద్, పుల్లయ్య, గోపాల్‌నాయక్, జోగయ్య, శ్రీనివాస్‌యాదవ్‌తో పాటు తదితరులు ఉన్నారు.

పార్టీ అభివృద్ధికి కష్టపడండి..!

- ప్రతి ఒక్కరికీ గుర్తింపు ఉంటుంది..

- ప్రతిపక్షాల మాటలకు గందరగోళానికి గురికావొద్దు

- బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళన సన్నాహక సమావేశంలో ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

మహబూబ్‌నగర్ ప్రతినిధి, మార్చి 25, ప్రభాతవార్త: ప్రతి కార్యకర్త కష్టపడి పనిచేస్తూ ఎప్పటికప్పుడు ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేర్చాలని, జడ్చర్ల శాసన సభ్యులు కార్యకర్తలకు సూచించారు. జడ్చర్ల లోని చంద్రా గార్డెన్ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళన సన్నాహక సమావేశానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరు కాగా,ఎమ్మెల్సీ కశిరెడ్డి నారాయణరెడ్డి ఇన్‌చార్జిగా వ్యవహరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి మాట్లాడుతూ ప్రతి పక్షాలు గందరగోళానికి గురిచేస్తాయని, అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రతి ప్రభుత్వ పథకాన్ని ప్రజల్లోకి చేర్చడంలో కార్యకర్తలు ముందుండాలని కోరారు. లీడర్లమనే భావన పక్కనపెట్టి ప్రతి ఒక్కరూ పార్టీ అభివృద్ధికి కష్టపడాలని స్పష్టంచేశారు. ప్రతి మండలంలో త్వరలో నిర్వహించే ఆత్మీయ సమ్మేళనానికి కార్యకర్తలు కుటుంబ సభ్యులతో కలిసి హాజరుకావాలని కోరారు. కార్యకర్తలే పార్టీకి బలమని, మీరు ఎంత బలంగా ఉంటే పార్టీ అంత పటిష్టంగా ఉంటుందని పేర్కొన్నారు. త్వరలోనే పాలమూరు రంగారెడ్డి పథకం పనులు పూర్తి చేసి నియోజకవర్గాన్ని సస్యశ్యామలం చేస్తామన్నారు. కర్వెన రిజర్వాయర్ 90శాతం పనులు పూర్తయ్యాయని, ఉదండాపూర్ పనులు యుద్ధప్రాతిపదికన కొనసాగుతున్నాయన్నారు. మౌలిక వసతుల కల్పన, ఉపాధి, సంక్షేమం, విద్యా, వైద్యం సహా అన్ని రంగాల్లో నియోజకవర్గం అభివృద్ధిలో దూసుకుపోతున్నదన్నారు. 9ఏండ్లలో తెలంగాణ ప్రభుత్వ హయాంలో చేసిన అభివృద్ధిని బూరీజు వేసుకోవాలని సూచించారు. గతంలో కరెంట్, నీళ్లకు ఇబ్బందులు పడ్డ మనం, నేడు కరెంట్ నీళ్ల తిప్పలు తప్పాయన్నారు. టీఎస్‌పీఎస్సీ పేపర్ లీక్ చేసింది బీజేపీ కార్యకర్త అని, వరుస నోటిఫికేషన్లు ఇస్తుండడంతో ప్రభుత్వానికి పేరొస్తుందని భావించి లీక్ చేసేందుకు కుట్ర జరిపారన్నారు. మాజీ ఎమ్మెల్యే ఎర్రశేఖర్‌ను తన కుమారుడి వివాహానికి పిలిచానని ఆయనే రాలేదన్నారు. ఆయన జడ్చర్లలో గృహప్రవేశం చేసి తనను కావాలనే పిలవలేదని, కొందరు కార్యకర్తలు, కౌన్సిలర్లను పిలిచి పార్టీ వీడుతున్నట్లు ప్రచారం చేయడం ఎంత సమంజసమన్నారు. ఇలాంటి చిల్లర రాజకీయాలు మానుకోవాలని హితువుపలికారు. అనంతరం ఎమ్మెల్సీ కశిరెడ్డి మాట్లాడుతూ తెలంగాణ ఎన్నో పథకాలు ఇరత రాష్ట్రాలు కాపీ కొడుతున్నాయని, నేడు దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. పార్టీకి నమ్మకంగా పని చేస్తే తప్పక గుర్తింపు లభిస్తుందన్నారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ యాదయ్య, గిరిజన కార్పొరేషన్ చైర్మన్ వాల్యానాయక్, డీసీఎంస్ చైర్మన్ ప్రభాకర్ రెడ్డి, సర్పంచుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రణీల్‌చందర్, మార్కెట్ కమిటీ చైర్మన్ మన్యం గోవర్ధన్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ లక్ష్మి, కౌన్సిలర్లు కోట్ల ప్రశాంత్‌రెడ్డి, ఉమాశంకర్,శ్రీశైలమ్మ,నందకిషోర్,లత,సతీష్,చౌహాన్ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

9ఏండ్లలో ఎంతో అభివృద్ధి..

- ఇప్పుడు నీళ్లు, కరెంట్‌కు ఇబ్బందులున్నాయా ..

- పని చేసే ప్రభుత్వాన్ని ఆశీర్వదించండి..

- ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి

మహబూబ్‌నగర్ ప్రతినిధి, మార్చి 25, ప్రభాతవార్త : గతంలో కరెంట్ నీళ్లు, కరెంట్ లేక అనేక వ్యవస్థలన్నీ కుంటుపడ్డాయని, వ్యవసాయం అయితే దండగా అని చాలా మంది వలస వెళ్లేవారని ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. స్వరాష్ట్రంలో పరిస్థితులు పూర్తిగా మారిపోయాయన్నా ప్రస్తుతం నీళ్లు , కరెంట్ ఫుల్లుగా ఉండడంతో వ్యవసాయం, ఇతర పరిశ్రమలు సైతం కళకళలాడుతున్నాయన్నారు. భూత్పూర్ మండలంలో ఎమ్మె

రైతుభీమా రూ.5లక్షల చెక్కు అందజేసిన ఎమ్మెల్యే

కెటిదొడ్డి,మార్చి 25 ప్రభాతవార్త : గద్వాల జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కెటిదొడ్డి మండల పరిధిలోని వెంకటాపురం గ్రామానికి చెందిన నర్సమ్మ మరణించారు. వారి కుటుంబ సభ్యులకు భర్త పాంటయ్యకు ప్రభుత్వం తరపున ఆర్థిక సాయాన్ని ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి చేతుల మీదుగా రైతుభీమా ద్వారా రూ. 5 లక్షల చెక్కును అందజేశారు. ఆపద స్థితిలో ఉన్న మమ్మల్ని ఆదుకున్నందుకు తెలంగాణ ప్రభుత్వం ముఖ్యమంత్రి ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ ఆంజనేయులు, వ్యవసాయ మార్కెట్ యార్డు డైరెక్టర్ భగవంతు, బిఆర్ఎస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రూ.6లక్షల 51000 పలికిన తై బజార్ వేలం..

కోయిల్‌కొండ, మార్చి 25 ప్రభాతవార్త : మండల కేంద్రమైన కోయిల్‌కొండలో గ్రామ పంచాయతీ కార్యాలయంలో గ్రామ సర్పంచ్ బి. కృష్ణ అధ్యక్షతన శనివారం తై బజార్ వేలం పాట నిర్వహించారు. తైబజార్ వేలం పాటను దక్కించుకోవడానికి ఏడుమంది గ్రామస్తులు పోటీపడ్డారు. ఈ వేలం పాటను ఆరు లక్షల 51000లకు గ్రామానికి చెందిన ఇమ్రాన్‌ఖాన్ పాట పాడి దక్కించుకున్నారు.ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ బి. కృష్ణ మాట్లాడుతూ గ్రామ పంచాయతీ సూచించిన రేట్ల మేరకే వసూలు చేయాలని ఆయన సూచించారు. వ్యాపారస్తుల దగ్గర అధిక డబ్బులు వసూలు చేస్తే వేలం రద్దు చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపిపి వై. మహెందర్ గౌడ్, ఎంపిటిసి జగన్, ఈఓఆర్‌డి శ్రీదేవి, వార్డు సభ్యులు రామస్వామి, ఆంజనేయులు, గౌస్, శ్యాంసుందర్, బండి నాగరాజు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ట్రేడింగ్ లైసెన్స్‌ను అందజేసిన మార్కెట్ చైర్మెన్

దేవరకద్ర,మార్చి 25 ప్రభాతవార్త: దేవరకద్ర వ్యవసాయమార్కెట్ యార్డులో శనివారం రైస్‌మిల్లు యజమానికి ట్రేడింగ్ లైసెన్స్‌ను మార్కెట్ చైర్మెన్ విజయవెంకటేశ్ అందజేశారు. బస్వాపూర్ స్టేజి సమీపంలో శశికళ ఇండస్ట్రీస్ రైస్‌మిల్లును ప్రారంభించారు. అయితే ఆ రైస్‌మిల్లుకు మార్కెటింగ్‌శాఖ్‌ట్రేడింగ్ లైసెన్స్‌ను మంజూరు చేసింది. అట్టి రైస్‌మిల్లు యజమాని రఘుకు ఆ లైసెన్స్‌ను మార్కెట్ చైర్మెన్ విజయవెంకటేశ్ అందజేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కార్యదర్శి ఎల్లస్వామి,సూపర్‌వైజర్ గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

జన చైతన్య బస్సు యాత్రను విజయవంతం చేయాలి..

అమరచింత,మార్చి 25 ప్రభాతవార్త: తెలంగాణ రాష్ట్రంలో సీపీఎం పార్టీ ఆధ్వర్యంలోజరుగుతున్న జన చైతన్య బస్సు యాత్రను విజయవంతం చేయాలని సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో బస్సు యాత్రకు సంబందించిన పోస్టర్‌ను శనివారం అమరచింత మండల కేంద్రంలోని జీ.ఎస్.భవనంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా నాయకులు బి.వెంకటేష్ మాట్లాడుతూ బీజేపీ అధికారంలోకి వస్తే ఏడాదికి రూ.2లక్షలు ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చిన ఇప్పటివరకు అమలు చేయడం లేదని అన్నారు. దేశంలో ఉన్న రైల్వే, ఎల్ఐసీ మినహాయింపు సంస్థలను ప్రైవేట్‌పరం చేసిందని దేశాన్ని పూర్తిగా కార్పోరేట్ సంస్థలకు అప్పజెప్పడం జరిగిందని అన్నారు. దేశంలో నిత్యవసర సరుకుల ధరలు విపరీతంగా పెరిగాయని బీజేపీ విధానాలకు వ్యతిరేకంగా బస్సుయాత్ర సీపీఎం చేపట్టిందని ఈనెల 27న అమరచింత బస్సుయాత్రను విజయవంతం చేయాలని ఆయన కోరారు. అజయ్, ఆర్.ఎన్.రమేష్, ఎ.బుచ్చన్న, శ్యాంసుందర్, లక్ష్మణ్,విష్ణు, చింటు, పాల్గొన్నారు.

స్వర్ణకార సంఘం ఎలక్షన్ నామినేషన్ ప్రక్రియ ప్రారంభం..

వనపర్తి టౌన్,మార్చి 25 ప్రభాతవార్త: వనపర్తి సంవర్ణకార సంఘం ఎలక్షన్ లో బాగంగా శనివారం నామినేషన్ ప్రక్రియ ప్రారంభమైంది. ఎన్నికలు ఈనెల 31, ఉదయం 8గంటల నుండి 3గంటల వరకు పోలింగ్ కొనసాగుతుంది. అధ్యక్షుడిగా జగత్పల్లి సురేష్ ఆచారి, కార్యదర్శి లింగమూర్తి ఆచారి, నామినేషన్ వేయడం జరిగింది. ఈ నామినేషన్ కార్యక్రమంలో 14వ వార్డు కౌన్సిలర్, స్వర్ణకార సంఘం జిల్లా అధ్యక్షులు పి.బ్రహ్మాచారి, జిల్లా కార్యదర్శి డి.శ్యాంసుందర్ ఆచారి, వనపర్తి జిల్లా విశ్వబ్రహ్మణ విశ్వకర్మ ఐక్య సంఘం అధ్యక్షులు ముమ్మడి డి.పరమేశ్వర చారి, టౌన్ అధ్యక్షులు పి.వెంకటచారి, ఎన్నికల కన్వీనర్ డి.వేణుచారి, ఎస్.వెంకటాచారి, కపిలవాయి శంకరాచారిచ జగత్పల్లి రమేష్, తెల్లరాళ్లపల్లి నాగరాజు, సత్యమాచారి, అశోక చారి, డి.రామాచారి, ఎస్.మాధవాచారి, తదితరులు పాల్గొన్నారు.

రక్తహీనత పై అవగాహన:ఎంఓ డా.వంశీకృష్ణ

వీపనగండ్ల,మార్చి 25 ప్రభాతవార్త: అనిమియా ముక్త్ భారత్ సందర్భంగా శనివారం వీపనగండ్ల మండల కేంద్రంలోని ప్రాథమిక ఆసుపత్రిలో మండల వైద్యా ధికారి డా.వంశీకృష్ణ ఆధ్వర్యంలో బాలింతలకు, గర్భిణీలకు సాధారణ రక్త పరీక్షలు చేసి రక్తహీనతపై అవగాహన కల్పించారు. విద్యార్థులు కూడా రక్తహీనతపై అవగాహన సదస్సు నిర్వహించారు. రక్తహీనతపై ఎలాంటి జాగ్రత్తలు, రక్తహీనత రాకుండా మంచి పోషకాహారాలు, పండ్లు తినాలని సూచించారు. కిశోర బాలింతలకు కూడా రక్తహీనత పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ నరసింహారెడ్డి, ఆసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బస్సు యాత్రను జయప్రదం చేయాలి

గండీడ్,మార్చి 25 ప్రభాతవార్త : బిజెపి మతోన్మాద కార్పోరేట్ విధానాలకు వ్యతిరేకంగా కార్మిక, రైతాంగ విధానాలకు వ్యతిరేకంగా సిపిఎం ఆధ్వర్యంలో జరుగుతున్న జనచైతన్య యాత్ర (బస్సు యాత్రను) జయప్రదం చేయాలని శనివారం జూలపల్లి గ్రామంలో పోస్టర్‌విడుదల చేశారు. ఈ పోస్టర్ విడుదల కార్యక్రమంలో ఎ పిఎం రాష్ట్ర నాయకులు కిల్లెగోపాల్, ఎ పిఎం జిల్లా కార్యదర్శి ఎ.రాములు, జిల్లా కమిటి సభ్యులు జి. నర్సింలు పాల్గొని ప్రసంగించారు. బిజెపి మతోన్మాద విధానాలకు వ్యతిరేకంగా కార్మిక రైతాంగ విధానాలకు వ్యతిరేకంగా పెరుగుతున్న ధరలను అరికట్టాలని నేడు సిపిఎం పార్టీ తలపెట్టిన జనచైతన్య యాత్రను జయప్రదం చేయాలని కోరారు. నేడు సాయంత్రం 4 గం.లకు నంచర్ల గేటుకు యాత్ర చేరుకుంటుందని తెలిపారు. కార్యక్రమంలో రైతులు, కార్మికులు, ప్రజలు యువతరం పెద్ద ఎత్తునపాల్గొని జయప్రదం చేయాలని కోరారు. పోస్టర్ విడుదల కార్యక్రమంలో రాజు, శివ, వెంకటేష్, అంజయ్య, భీమయ్య పాల్గొన్నారు.

దేవస్థానానికి కోడెగూడల ఆదాయం రూ.1.46లక్షలు

దేవరకద్ర,మార్చి 25 ప్రభాతవార్త: దేవరకద్ర మండలం చిన్నరాజమూర్ శ్రీ ఆంజనేయస్వామి దేవస్థానానికి కోడెదూడల వల్ల రూ.1లక్ష46వేల200 రూపాయల ఆదాయం వచ్చింది. దేవస్థానానికి స్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా భక్తులు కానుకల రూపంలో సమర్పించిన 27 కోడెదూడలకు శనివారం దేవస్థానం వద్ద వేలంపాట నిర్వహించారు. దీంతో ఈ కోడెదూడల వేలం పాట నిర్వహించగా ఈ వేలంపాటలో పాల్గొన్న కొంతమంది అత్యధికంగా వేలపాట పాడి కైవసం చేసుకొన్నారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం చైర్మెన్ ఆర్.గోపాలచారి,వ్యవస్థాపక అర్చకులు భీమాచారి,రామాచారి,రాఘవేంద్రాచారి,హనుమేషచారి,పరిమళాచారి,మేనేజర్ ప్రసాద్‌లతో పాటు భక్తులు తదితరులు పాల్గొన్నారు.

నేటి సమాజంలో బాలికలకు ఆత్మరక్షణ విద్యా ఎంతో అవసరం

- బాలికలకు కుంగ్ ఫూలో శిక్షణ పొందిన విద్యార్థులకు సర్టిఫికెట్లు ప్రధానం
- ప్రభుత్వం బాలికల ఆత్మరక్షణ విద్యకు ప్రాధాన్యత ఇస్తుంది
- ప్రస్తుతం యువత వ్యాయామానికి సమయం కేటాయించాలి
- ఎమ్మెల్యే సతీమణి బండ్ల జ్యోతి

మాట్లాడుతున్న ఎమ్మెల్యే సతీమణి జ్యోతి

విద్యార్థినిలకు కుంగ్‌ఫూ శిక్షణ ఇస్తున్న దృశ్యం

గద్వాల ప్రతినిధి,మార్చి 25 ప్రభాతవార్త : నేటి సమాజంలో బాలికలపై జరిగే దాడుల నుండి తమకు తాను రక్షించుకోవడానికి కుంగ్ ఫూ నేర్చుకోవాలని ప్రతి పాఠశాలలో తప్పనిసరిగా బాలికలకు ప్రత్యేకంగా శిక్షణ ఇప్పించాలని ఎమ్మెల్యే సతీమణి బండ్ల జ్యోతి తెలిపారు. గద్వాల జిల్లా కేంద్రంలోని చింతలపేటలోని, ఇండోర్ స్టేడియంలో కుంగ్ ఫూ శిక్షణ పొందిన విద్యార్థులకు సర్టిఫికెట్లు ప్రధానోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే సతీమణి బండ్ల జ్యోతి హాజరయ్యారు. ఎమ్మెల్యే సతీమణి బండ్లజ్యోతి మాట్లాడుతూ స్వీయరక్షణ, ఆత్మ రక్షణ కోసం కుంగ్ ఫూను నేర్చుకోవాలని కోరారు. అలాగే ప్రభుత్వ పాఠశాలలో సైతం బాలికల రక్షణ కోసం వ్యాయామాలు, విద్యాలయాలు కుంగ్‌ఫూ కరాటే చేర్చాలని పాఠశాలలో ప్రతిరోజు ఒక పీరియడ్‌ను ఆత్మ రక్షణ విద్యలను అందించాలని కోరారు. బాలికలు స్వేచ్ఛగా రోడ్డుపైన తిరిగిన రోజే నిజమైన స్వాతంత్రం వచ్చినట్లు తెలిపారు. ఆరోగ్య తెలంగాణ కోసం ప్రతిరోజు తప్పనిసరిగా వ్యాయామాలు చేయాలని మనిషికి ఆరోగ్యం ఉంటేనే రాష్ట్రం బాగుపడుతుందని దేశం కూడా బాగుపడుతుందని తెలిపారు. గ్రౌర్‌లో ఎప్పుడు అయితే జనం పెరుగుతుందో ఆరోజు ఆరోగ్య తెలంగాణ తయారవుతుందని అన్నారు. గద్వాలలో గత పాలకుల నిర్లక్ష్యం వలన ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి ఒక గ్రౌండ్ కూడా ఉండేది కాదని అన్నారు. నేడు ఇండోర్ స్టేడియంలో క్రీడాకారులు అందుబాటులో ఎమ్మెల్యే తన సొంత నిధులతో గ్రౌండ్లను అభివృద్ధి పరిచి క్రీడాకారులకు అందుబాటులోకి తెచ్చారు. అలాగే ప్రతి గ్రామాలలో క్రీడా ప్రాంగణాల నిర్మాణం చేశారు. క్రీడాకారులకు ప్రభుత్వం పెద్దపీట వేసిందని తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్ కృష్ణ, ఉమ్మడి జిల్లా కెటిఆర్ యువసేన ప్రధాన కార్యదర్శి కృష్ణకుమార్‌రెడ్డి,సర్పంచ్ మహబూబ్, ఇండోర్ స్టేడియం ఇంఛార్జి జితెందర్, బిఆర్ఎస్ పార్టీ మహిళా నాయకురాలు సంగీత, బిఆర్ఎస్ పార్టీ నాయకులు నవీన్‌రెడ్డి, జగదీష్, కృష్ణ,వీరేష్, చిన్నగాంధి, కుంగ్ ఫూలో కరాటే మాస్టర్,నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కోర్టుకు వెళ్లిన పట్టాదారులకు న్యాయం చేయాలి..

అర్హులైన డబుల్ బెడ్ రూం దరఖాస్తు చేసుకోని వారికి రెండు రోజులు గడువు ఇవ్వాలి

అడిషనల్ కలెక్టర్ అపూర్వ చౌహాన్‌కు వినతి పత్రం అందజేస్తున్న దృశ్యం

గద్వాల ప్రతినిధి,మార్చి 25 ప్రభాతవార్త : గద్వాల పట్టణంలోని నిరుపేదలకు డబుల్ బెడ్ రూములు మంజూరుకై దరఖాస్తు చేసుకొనుటకు మరోసారి అవకాశం కల్పించాలని ప్రజల కోరిక మేరకు భారతీయ జనతా పార్టీ జాతీయ ఉపాధ్యక్షురాలు డికె అరుణమ్మ సూచన మేరకు గద్వాల జిల్లా కలెక్టర్ కార్యాలయంలో అసెంబ్లీ కన్వీనర్ రామాంజనేయులు ఆధ్వర్యంలో అడిషనల్ కలెక్టర్ అపూర్వ చౌహాన్‌కి వినతి పత్రం ఇవ్వడం జరిగింది.ఈ సందర్భంగా రామాంజనేయులు మాట్లాడుతూ ఇంతకు ముందు జోగులాంబ గద్వాల జిల్లా గద్వాల పట్టణంలోని ఉన్నటువంటి ప్రజలు డబుల్ బెడ్‌రూంలు మంజూరుకై అర్హులైనవారు దరఖాస్తు చేసుకుని వారు ఉంటే గద్వాల మండల తహసిల్దార్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాల్సిందిగా ప్రకటించినప్పటికి అప్పుడు ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ఉన్నందున సంబంధిత అదికారులు దరఖాస్తులు తీసుకోలేదని అందుకు ప్రజల కోరిక మేరకు దరఖాస్తులు మళ్లీ స్వీకరించాలని రెండు రోజులు గడువు ఇవ్వాలని కోరారు. కోర్టుకు వెళ్లిన పట్టాదారులకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు కుమ్మరి శ్రీనివాసులు, త్యాగరాజు, గుర్రం నరసింహులు, కబీర్దాస్, అనిత, రజక జయశ్రీ, జిల్లా ఓబిసి మోర్చా అధ్యక్షుడు కబీర్‌దాసు నర్సింలు, బిజెపి సీనియర్ నాయకులు రజక నరసింహ, పులిపాటి వెంకటేష్, సురేష్, రామచంద్రుడు ఉన్నారు.

పోషణపక్షం కార్యక్రమంలో మిల్లెట్స్‌పై విద్యార్థులకు అవగాహన

మిల్లెట్స్‌పై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

గండీడ్,మార్చి 25 ప్రభాతవార్త : మండల పరిధిలోని సల్కర్‌పేట అంగన్‌వాడి కేంద్రంలో పోషణ పక్షం కార్యక్రమంలో భాగంగా మిల్లెట్స్‌పై అవగాహన సమావేశం నిర్వహించారు. చిరుధాన్యాలు (మిల్లెట్స్) ఉపయోగించడం వల్ల పోషణ విలువలు లభిస్తాయని వివిధ ఆహార పదార్థాలను తయారు చేసే విధానాన్ని విద్యార్థులకు అంగన్‌వాడి వర్కర్లు చూయించారు. మిల్లెట్స్‌తో పాటు ఆకుకూరలు, గుడ్లు, పండ్లు ప్రతిరోజు ఆహారంలో తప్పకుండా తినాలని ఉపాధ్యయులు సూచించారు. కిశోర బాలికలు,గర్భిణీ స్త్రీలు, తల్లులు పిల్లల్లో వచ్చే రక్తహీనత, మరుగుజ్జుతనం, తక్కువ బరువుతో పుట్టడం వంటి పోషకాహార లోపాల్ని నివారించడానికి వారికి సంపూర్ణ ఆరోగ్య అభివృద్ధికి, పోషకాహారం పరిజ్ఞానం పట్ల అవగాహన కల్పించడం కోసం పోషణపక్షం కార్యక్రమంలో భాగంగా మిల్లెట్స్‌పై అవగాహన కల్పించడం కార్యక్రమం ముఖ్య ఉద్దేశం. సమావేశం అనంతరం రాగిలడ్డు దాని పోషక విలువలు అది ఎలా తయారు చేయాలో విద్యర్థులకు వివరించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధాన ఉపాధ్యాయురాలు కృష్ణవేణి, పవర్, ఐసిడిసి సూపర్‌వైజర్ రాధిక, మమత, అంగన్‌వాడి టీచర్లు ఇందిరమ్మ, భూదేవి గర్భిణీలు, బాలింతలు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజల సమస్యలను పరిష్కరించలేని పాలకులు ఎందుకు..!

సాగునీరు అందక ఎండిన పంటపొలాలు నడిగడ్డ ఆత్మగౌరవ పాదయాత్రలో గొంగళ్ల రంజిత్‌కుమార్

ఆత్మగౌరవ పాదయాత్రలో గొంగళ్ల రంజిత్‌కుమార్

ఆత్మగౌరవ యాత్రలో మాట్లాడుతున్న రంజిత్‌కుమార్

గద్వాల ప్రతినిధి,మార్చి 25 ప్రభాతవార్త : గద్వాల మండలం అనంతపురం గ్రామంలో వ్యవసాయ పొలానికి సాగునీరు అందక పంటలు ఎండిపోయిన పరిస్థితి ఏర్పడిందని నడిగడ్డ ఆత్మగౌరవ పాదయాత్రలో భాగంగా గొంగళ్ల రంజిత్‌కుమార్ అన్నారు. బీరెల్లిలో ప్రారంభమైన పాదయాత్ర బస్వాపురం నుండి అనంతపురం గ్రామం మీదుగా సాగి, మధ్యాహ్న విరామం తదనంతరం పూడూరు గ్రామానికి చేరుకోవడం జరిగింది. బస్వాపురంలో గ్రామానికి బస్సు సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నట్లు ప్రజలు వాపోయారు. గ్రామంలో ప్రభుత్వ స్కూల్ లేక అందరు ఎర్రవల్లిలోని ప్రైవేట్ స్కూల్‌కు పంపిస్తున్నట్లు చెప్పారు. అనంతరం గ్రామంలోని మైబెల్లి అనే ఓ రైతు దాదాపు 5 ఎరాలకు 2 లక్షల 50 వేలకుపైగా పెట్టుబడి పెట్టి సాగునీరు అందక పరిపంట మొత్తం ఎండిపోయిన పరిస్థితి ఉందని రైతు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గొంగళ్ల రంజిత్‌కుమార్ మాట్లాడుతూ నెట్టెంపాడు ప్రాజెక్టు కింద 2 లక్షల ఎకరాలకు పైగా సాగునీరు అందిస్తామన్న పాలకులు మరి ఇప్పుడు ఏం చేస్తున్నారు. దీనికి సమాధానం చెప్పాలని గొంగళ్ల రంజిత్‌కుమార్ అన్నారు. వారబంది ప్రకారం సాగునీరు అందించాల్సిన వీరు వాళ్ల అవసరం ఉన్నప్పుడు ఒకరోజు సాగునీరు కాలువలు ద్వారా విడిచి మిగతా నాలుగు రోజుల వరకు సాగునీరు అందించలేని పరిస్థితి ఏర్పడిందని దీంతో వ్యవసాయ రంగం పూర్తిగా దెబ్బతింటుందని ఈ విషయాన్ని గమనించి అధికారులు వెంటనే సాగునీరు అందించడానికి కృషి చేయాలని కోరారు. అనంతపురం సభలో మాట్లాడుతూ ఇన్నాళ్ల వీరి పాలనలో అభివృద్ధి పరంగా నియోజకవర్గం వెనుకబాటుతనానికి గురైందని ప్రజలకు సంక్షేమ అందించకుండా అధికారాన్ని అడ్డం పెట్టుకుని కేవలం అక్రమ సంపాదనకు అలవాటు పడ్డారని అన్నారు. కార్యక్రమంలో కన్వీనర్ బుచ్చిబాబు, నాయకులు శ్రీనివాస్‌యాదవ్, లవన్న, కవి అవనిశ్రీ, విష్ణు,ప్రేమ్‌రాజ్, వామన్‌పల్లి, రంగస్వామి, నాగేష్ యాదవ్, నెట్టెంపాడు గోవిందు, అంజి, దాసరిపల్లి రాముడు, రమేష్, పరశురాముడు, సవారన్న,లక్ష్మన్న, నేతన్న, భూపతినాయుడు, భీమన్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టులకు అండగా ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి...

సమన్వయంతో ముందుకు సాగాలి -పదవిని ఒక బాధ్యతగా భావించాలి

-టీయూడబ్ల్యూజే హెచ్-143 రాష్ట్ర సహాయ కార్యదర్శి అబ్దుల్లాఖాన్

నూతనంగా ఎన్నికైన జర్నలిస్టు జిల్లా కమిటీ

నాగర్‌కర్నూల్ ప్రతినిధి, మార్చి 25 ప్రభాతవార్త: జర్నలిస్టులకు అండగా ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని టీయూడబ్ల్యూజే హెచ్ 143 రాష్ట్ర సహాయ కార్యదర్శి అబ్దుల్లా ఖాన్ అన్నారు. శనివారం నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని హిమాలయ కన్వెన్షన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన నాగర్‌కర్నూల్ జిల్లా తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ హెచ్ 143 పూర్తి స్థాయి కార్యవర్గాన్ని రాష్ట్ర కమిటీ ఆదేశాల మేరకు శనివారం ప్రకటించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అల్లం నారాయణ గారి సారథ్యంలో జర్నలిస్టుల సంక్షేమానికి పెద్ద పీట వేసిందన్నారు. గతంలో ఉమ్మడి రాష్ట్రంతో పాటు దేశంలోని ఏ రాష్ట్రంలో అమలు చేయని పథకాలను జర్నలిస్టుల సంక్షేమం కోసం తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్, యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు అల్లం నారాయణ చేసిన కృషి అభినందనీయమన్నారు. నూతనంగా ఎన్నికైన జిల్లా కమిటీలకు ఆయన ప్రత్యేక అభినందనలు తెలిపారు. యూనియన్ బలోపేతానికి, జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. సమావేశంలో ఐజేయూ జాతీయ నాయకులు జెమిని సురేష్, తెలంగాణ ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్ట్ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షులు శేఖరాచారి, జిల్లా నూతన అధ్యక్షులు చంద్రశేఖర్‌రావు, ప్రధాన కార్యదర్శి రాజేష్‌గౌడ్, తెంజు జిల్లా అధ్యక్షులు ఖానాపురం ప్రదీప్‌లతో పాటు సీనియర్ జర్నలిస్టులు సాయిలు సాగర్, ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులు, ఫోటో, వీడియో జర్నలిస్టులు తదితరులు ఉన్నారు.

ఎల్ఓసిని అందజేసిన ఎమ్మెల్యే ఆల

దేవరకద్ర,మార్చి 25 ప్రభాతవార్త: కొకుంట్ల మండలం పుట్టపల్లి గ్రామానికి చెందిన ఓ వ్యక్తికి శనివారం ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి ముఖ్యమంత్రి సహాయనిధి నుండి వచ్చిన ఎల్ఓసిని అందజేశారు. హైద్రాబాద్‌లోని పంజాగుట్టలో నున్న నిజా ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ కళాశాలలో చికిత్స చేయించుకోవడానికి మంజూరైన రూ.లక్షరూపాయల ఎల్ఓసిని పుట్టపల్లి గ్రామానికి చెందిన రమేశ్‌కు ఎమ్మెల్యే ఆల అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ శ్రీనివాసరావుతో పాటు రమేశ్ కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయమందించిన ఇప్పటూర్ సర్పంచ్

నవాబ్‌పేట,మార్చి 25 ప్రభాతవార్త : మండలంలోని ఇప్పటూర్ గ్రామం నిరుపేద కుటుంబానికి చెందిన వడ్ల బాలమణి (90) మరణించింది. వారి మృతికి సంతాపం తెలిపిన ఇప్పటూర్ ఉపసర్పంచ్ దుబ్బ రవికిరణ్ పరామర్శించి రూ. 5 వేల ఆర్థిక సహాయం అందజేశారు.కార్యక్రమంలో నర్సింగరావు, పూజారి వెంకటయ్య, జనమయ్య, అరవింద్, కృష్ణయ్య, కమ్మరి శేఖర్, సూరి తదితరులు పాల్గొన్నారు.

దేవరకద్ర వ్యవసాయ మార్కెట్‌ధరలు..

రూ.6209 ధర పలికిన కింటాల్ ఆముదాలు

దేవరకద్ర,మార్చి 25 ప్రభాతవార్త: దేవరకద్ర వ్యవసాయ మార్కెట్ యార్డుకు శనివారం 66 కింటాళ్ళ ఆముదాలను రైతులు విక్రయానికి తీసుకవచ్చారు. అయితే కింటాల్ ఆముదాలకు అత్యధికంగా రూ.6209 ధర పలికింది. అలాగే అతి తక్కువగా రూ.6119 ధర పలికినట్లు మార్కెట్ అధికారులు తెలిపారు.

మృతుడి కుటుంబానికి ఆర్థికసహాయం

దేవరకద్ర,మార్చి 25 ప్రభాతవార్త: దేవరకద్రలో రైలుకింద పడి ఆత్మహత్య చేసుకొన్న యువకుడి కుటుంబానికి బీఆర్ఎస్ మండల పార్టీ మాజీ అధ్యక్షుడు కుర్వ కెంగూరి శ్రీకాంత్‌యాదవ్ శనివారం ఆర్థిక సహాయం అందజేశారు. స్థానిక బాలప్ప కుమారుడు బీరప్ప శుక్రవారం రైలుకింద ఆత్మహత్య చేసుకొన్నాడు. ఈ విషయం తెలుసుకొన్న శ్రీకాంత్‌యాదవ్ మృతుడి ఇంటికి వెళ్ళి కుటుంబసభ్యలను పరామర్శించారు. రూ.10వేల ఆర్థిక సహాయాన్ని వారికి అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఈనెల 28న మైనార్టీ కార్పోరేషన్ ఋణాలకు ఇంటర్వ్యూలు..

అమరచింత,మార్చి 25 ప్రభాతవార్త: మైనార్టీ కార్పోరేషన్ ఋణాలకు దరఖాసునత చేసుకున్న నిరుద్యోగులకు ఈనెల 28న అమరచింత మున్సిపల్ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నామని మున్సిపల్ కమీషనర్ మహ్మద్ ఖాజ శనివారం తెలిపారు. ఇంటర్వ్యూలకు హాజరయ్యే వారు ఆధార్ కార్డు, ఆదాయ ధృవీకరణ పత్రం, రేషన్ కార్డు, వికలాంగుల సదరం సర్టిఫికేట్స్ ఒరిజినల్స్ తీసుకోవని ఉదయం 10.30 గంటల నుండి సాయంత్రం 5గంటల వరకు ఉంటుందని ఆయన తెలిపారు.

ఆకట్టుకుంటున్న ప్రీస్కూల్ మేళా..

మద్దూరు,మార్చి 25 ప్రభాతవార్త : మండల కేంద్రంలోని నిడ్జింత గ్రామంలో శనివారం చిన్నారులతో నిర్వహించిన ప్రీస్కూల్ మేళా ఆకట్టుకుంది. బాలింతలకు, గర్భవతులకు అందించే పౌష్టికాహారం సద్వినియోగం చేసుకోవాలని వారి ఆరోగ్యానికి, ఎదుగుదలకు చేపట్టిన చర్యలపై వివిధ నృత్యాలు ప్రదర్శించారు. కార్యక్రమంలో సంస్థప్రతినిధి పద్మ, సర్పంచ్ లావణ్య, అంగన్‌వాడి టీచర్లు శైలజ, సురేఖ, లాలమ్మ, అరుణ, లలిత, ఆశ వర్కర్లు భాగ్యమ్మ, మంజుల, మైముదా గ్రామస్తులు పాల్గొన్నారు.

పుల్గర్‌చర్ల గ్రానికి ఎమ్మెల్యే రాక..

వీపనగండ్ల,మార్చి 25 ప్రభాతవార్త: మండల కేంద్రంలోని పుల్గర్‌చర్ల గ్రామానికి ఈనెల 26వ తేదీన ఆదివారం మండలంలోని పుల్గర్‌చర్ల గ్రామానికి ఉదయం 10గంటలకు జరిగే గ్రామ బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తల సమావేశానికి కొల్లాపూర్ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్ రెడ్డి రానున్నట్లు బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు ఎద్దుల సురేందర్ రెడ్డి తెలిపారు. పార్టీ కార్యకర్తలు ఈ కార్యక్రమంలో పెద్దఎత్తున హాజరవ్వాలని తెలిపారు. ఈ సమావేశంలో 2024 సంవత్సరంలో జరిగే అసెంబ్లీ ఎన్నికల గురించి పార్టీ కార్యకర్తలకు దిశానిర్దేశం చేసే అవకాశం ఉందని తెలిపారు.

శోభయాత్ర పోస్టర్ ను ఆవిష్కరించిన మంత్రి..

వనపర్తి టౌన్,మార్చి 25 ప్రభాతవార్త: వనపర్తి జిల్లా కేంద్రంలోని ఈనెల 30న శ్రీరామ నవమి సందర్భంగా శోభయాత్రలో అందరు పెద్దఎత్తున పాల్గొనాలని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి శ్రీరామ నవమి సందర్భంగా శోభయాత్ర పోస్టర్ ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మంత్రి వెంట శ్రీరామ నవమి శోభయాత్ర ఉత్సవ కమిటీ సభ్యులు నీల స్వామి, మాధవరావు సునీల్ వాల్మీకి, పుట్టపాకుల మహేష్, ఎర్ర శ్రీను, పరంజ్యోతి, ఆవుల రమేష్, బండారు కృష్ణ, అనుపాటి రాము, నందిమల్ల సుబ్బు, ప్రణీత్, శివరాం, కార్తీక్, సాయి గౌడ్, ముఖ్యులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి అండగా నిలుస్తాం:ఎమ్మెల్యే మర్రి

నాగర్‌కర్నూల్ ప్రతినిధి, మార్చి 25 ప్రభాతవార్త: నాగర్‌కర్నూల్ పట్టణానికి చెందిన దమ్మోజు వీరశేఖరాచారి శనివారం ఉదయం మృతి చెందాడు. మృతుడి కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే మర్రి జనార్ధన్‌రెడ్డి పరామర్శించి మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇంజనీరింగ్ చదవకపోయిన తనదైన మేధాశక్తితో ఆ స్థాయికి చేరారన్నారు. మోటార్, ఇంజనీరింగ్‌లో ప్రతిభ అపారం ఉందని, ఆ కాలంలోనే వచ్చే ఆధునికతను పుణికిపుచ్చుకున్నారని పేర్కొన్నారు. స్థానికంగా కార్ఖానా నెలకొల్పి మంచి పేరు సంపాదించారని ప్రశంసించారు. తన పేరుతో వీరశేఖరం కార్ఖానా స్థాపించి ఎందరికో ఆదర్శంగా నిలిచారని పేర్కొన్నారు. వీరశేఖర మరణం తీరని లోటు అన్నారు. మృతుడి కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటానన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు తదితరులు ఉన్నారు.

అభాగ్యులకు అండగా సీఎం రిలీఫ్ ఫండ్..

-జెడ్పీటీసీ పోతుగంటి భరత్‌ప్రసాద్

కల్వకుర్తి, మార్చి 25 ప్రభాతవార్త:ప్రమాదవశాత్తు గాయపడిన క్షతగాత్రులకు, అనారోగ్య భారిన పడి చికిత్సలు చేయించుకోలేని అభాగ్యులను ఆదుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం సీఎం రిలీఫ్ ఫండ్, ఎల్ఓసీని అందించి అభాగ్యులకు అండగా నిలుస్తోందని జెడ్పీటీసీ పోతుగంటి భరత్‌ప్రసాద్ పేర్కొన్నారు. శనివారం కల్వకుర్తి మండలం పంజుగుల గ్రామానికి చెందిన బ్రహ్మచారికి మంజూరైన రూ.32వేల చెక్కును జెడ్పీటీసీ పోతుగంటి భరత్‌ప్రసాద్ కుటుంబ సభ్యులకు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నో పథకాలను ప్రవేశ పెట్టి మహిళలకు, రైతులకు, క్షతగాత్రులను ఆదుకునేందుకు ఆర్థిక సహాయంతో పాటు సదుపాయాలను కల్పించి వారి కుటుంబానికి భరోసా కల్పిస్తోందని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, బాధిత కుటుంబ సభ్యులు తదితరులు ఉన్నారు.

జాతీయ సమాచార హక్కు పరిరక్షణ సమితి..

మండల కన్వీనర్‌గా ఎం. రామునాయక్

కోయిల్‌కొండ,మార్చి 25 ప్రభాతవార్త : జాతీయ సమాచార హక్కు పరిరక్షణ సమితి మండల కన్వీనర్‌గా మండలంలోని కేశవాపూర్ గ్రామ పంచాయతీలో గల రాజునాయక్ తండాకు చెందిన గిరిజన నేత ఎం.రామునాయక్‌ను జాతీయ సమాచార హక్కు పరిరక్షణ సమితి జాతీయ ఛైర్మన్ బొమ్మర బోయిని కేశవులు ఆదేశానుసారం రాష్ట్ర కో ఆర్డినేటర్ ఉషారాణి, ఎం. రామునాయక్‌ను నియమిస్తూ నియామక పత్రం జారీ చేయడం జరిగింది.నూతనంగా ఎంపికైన జాతీయ సమాచార హక్కు పరిరక్షణ సమితి మండల కన్వీనర్ ఎం. రామునాయక్ మాట్లాడుతూ సమాచారహక్కు చట్టం గురించి పౌరులకు తెలియజేస్తూ అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. అవినీతి రహిత సమాజ నిర్మాణంలో పాలుపంచుకునే విధంగా విధులు నిర్వహించడం జరుగుతుందన్నారు. సంస్థ అభివృద్ధికి తోడ్పడుతూ అన్ని వేళల్లో అందుబాటులో ఉంటాను అన్నారు.నాపై నమ్మకం ఉంచి నన్ను సమాచార హక్కుపరిరక్షణ సమితి మండల కన్వీనర్‌గా నియమించిన జాతీయ నేతలకు, రాష్ట్ర కో ఆర్డినేటర్లకు, జిల్లా నేతలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. జె. ఆంజనేయులు, ఊదరి రవి, వి.వెంకటేష్,రాజు, ఎం.గోవర్ధన్, పి. రాజు, ఈ. శేఖర్‌గౌడ్ పాల్గొన్నారు.

సర్పంచ్‌లకు జాతీయ పంచాయతీ అవార్డు పురస్కారాలు

పదర,మార్చి 25 ప్రభాతవార్త : మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ ఆవరణలో శనివారం ఆయా గ్రామ పంచాయతీల సర్పంచ్‌లకు, జడ్పీటిసి రాంబాబునాయక్, ఎంపిడిఓ శంకర్ ఆధ్వర్యంలో జాతీయ పంచాయతీ అవార్డు పురస్కారాలను అందజేశారు. ముందుగా అన్ని గ్రామపంచాయతీల సర్పంచ్‌లు ఆయా గ్రామాల కార్యదర్శులను శాలువా,పూలమాలలతో సత్కరించి అవార్డు పత్రాన్ని వారికి అందజేశారు. ఈ సంద ర్భంగా జడ్పీటిసి రాంబాబునాయక్ మాట్లాడుతూ గ్రామ పంచాయతీలు అభివృద్ధిలో సర్పంచ్‌లు, కార్యదర్శులు కీలక పాత్ర వహించారని దీంతో మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలు పారదర్శకంగా నిర్వహించాలని దీంతో మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలు అభివృద్ధి దిశగా అడుగులు పడుతున్నాయని వారు అన్నారు.జడ్పీటిసి రాంబాబునాయక్,ఎంపిడిఓ శంకర్ నాయక్, ఎంపిఓ రాములు, సిబ్బంది జగదీశ్వర్, వెంకటేష్, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, కార్యదర్శులు పాల్గొన్నారు.

రహదారిని కబ్జా చేసిన వ్యక్తి పై చర్యలు తీసుకోవాలి..

2వ రోజు మున్సిపల్ కార్యాలయం ముందు కాలనీవాసుల ధర్నా..

అమరచింత,మార్చి 25 ప్రభాతవార్త: అమరచింత మున్సిపల్ కేంద్రంలోని 4వ వార్డు ఎస్సీ కాలనీ ప్రజలు నడిచే ప్రభుత్వ రహదారిని అదే కాలనీ చెందిన వ్యక్తి అక్రమంగా కబ్జా చేసి రహదారికి అడ్డంగా మట్టి వేయడాన్ని నిరసిస్తూ కాలనీవాసులు శనివారం 2వ రోజు అమరచింత మున్సిపల్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీవాసులు అబ్రహం, భాస్కర్, కళానందం, అబ్రహంలు మాట్లాడుతూ ఎన్నో ఏళ్ల నుండి ప్రజలు తిరిగే రహదారిని కబ్జా చేసి రిజిస్ట్రేషన్ చేసిన అధికారులపై చర్యలు తీసుకొని కేసు నమోదు చేయాలని వారు డిమాండ్ చేశారు. ధర్నా చేస్తున్న మున్సిపల్ కార్యలయానికి మున్సిఎల్ ఛైర్‌పర్సెన్ వి.మంగమ్మ, కమీషనర్ మహ్మద్ ఖాజ, 4వ వార్డు కౌన్సిలర్ సింధుజ, 5వ వార్డు కౌన్సిలర్ బీ.ఎస్.రాజ్‌కుమార్ ఆందోళన చేస్తున్న కాలనీవాసులకు అక్రమంగా రహదారి కబ్జా చేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోని రిజిస్ట్రేషన్ రద్దు చేయిస్తామని ప్రభుత్వం రహదారికి అడ్డంగా వేసిన మట్టిని తొలగించి సీసీ రోడ్డు వేస్తామని వారు హామీ ఇవ్వడంతో కాలనీవాసులు ఆందోళన విరమించారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు పాల్గొన్నారు.

కిశోర బాలికలు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి..

అమరచింత,మార్చి 25 ప్రభాతవార్త: కిశోర బాలికలు వ్యక్తిగత పరిశుభ్రత పాటించి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని మున్సిపల్ ఛైర్‌పర్సెన్ వి.మంగమ్మ భూషణం గౌడ్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నర్మద కోరారు. శనివారం పోషణ పక్షం కార్యక్రమం 5వ అంగన్వాడీ కేంద్రంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కిశోర బాలికలు ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి చిరు ధాన్యాలైన రాగులు, జొన్నలు, సజ్జలు, మొలకెత్తిన గింజలు, నువ్వులు, బెల్లం ఆహారం తీసుకోవాలని వారు కిశోర బాలికలను కోరారు. అలాగే ఎలాంటి రోగాల బారినపడకుండా కిశోరబాలికలు, గర్భిణీలు, బాలింతలు ఐరన్, కాల్షియం లో విటమిన్లు అధికంగా ఉండడం వల్ల గుండె జబ్బులు రాకుండా ఉంటాయని వారు తెలిపారు. ప్రతి ఒక్కరు పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు నాగేంద్రమ్మ, బాలేశ్వరి, వెంకటేశ్వరమ్మ, శశికళ, రాధిక, కమల, రేణుక, వజ్రమ్మ పాల్గొన్నారు.

ఆర్టీసీ సేవలను ప్రజలు ఉపయోగించుకోవాలి..

అంబలి కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మంత్రి నిరంజన్ రెడ్డి, కలెక్టర్ ,డీఎం

నూతన బస్సులను జెండా ఊపి ప్రారంభిస్తున్న మంత్రి నిరంజన్ రెడ్డి

తొలి టికెట్ కొని బస్సులో ప్రయాణిస్తున్న మంత్రి

సింగిరెడ్డి తారకమ్మ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అంబలి కేంద్రాలు.. నూతన 2సూపర్ లగ్జరీ బస్సులను ప్రారంభించిన రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి

వనపర్తి ప్రతినిధి,మార్చి 25 ప్రభాతవార్త: వనపర్తి నుండి హైదరాబాద్‌కు నూతనంగా ఏర్పాటు చేసిన రెండు సూపర్ లగ్జరీ బస్సులను ప్రారంభించి తొలి టికెట్ ను రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి, జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్, డీఎం పరమేశ్వరి కొని ప్రారంభించారు. అంతకు ముందు ప్రజల సౌకర్యార్థం వనపర్తి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం, వనపర్తి జిల్లా ఆసుపత్రి, ఆర్టీసీ బస్టాండ్,గాంధీ చౌక్, ఇందిరాపార్క్‌ల వద్ద కీర్తిశేషులు సింగిరెడ్డి తారకమ్మ జ్ఞాపకార్థం సింగిరెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అంబలి కేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గ్రామాల నుండి వివిధ పనుల మీద జిల్లా కేంద్రానికి వచ్చే ప్రజలు ఆసుపత్రుల్లో చికిత్స నిమిత్తం వచ్చే రోగులు, వారి బంధువులు అంబలి కేంద్రాలను సద్వినియెగం చేసుకోవాలని ఆయన తెలిపారు. వనపర్తి ప్రజల సౌకర్యార్థం హైదరాబాద్ నూతనంగా రెండు సూపర్ లగ్జరీ బస్సులను ప్రారంభించారు. రాష్ట్రంలో అత్యధిక మంది ప్రజలు సేవలు అందిస్తున్నది ఆర్టీసీ సంస్థనే అని అన్నారు. సురక్షితమైన ప్రయాణం కొరకు ప్రజలు ఆర్టీసీ ఆశ్రయించాలని పేర్కొన్నారు. వేసవి తాపం నుండి ప్రజలకు ఉపశమనం కలిగించేందుకు అంబలి కేంద్రాలు ప్రారంభించామని అన్నారు. ఆర్టీసీ సేవలను ప్రజలు ఉపయోగించుకోవాలని, ప్రజల అవసరాల మేరకు నూతన బస్సుల సౌకర్యం ఏర్పాటు చేశామని అన్నారు.

నల్లమల్ల ప్రజలను కంటికి రెప్పలా కాపాడుకుంటా...

- **కళ్యాణలక్ష్మి, పేదింటి బిడ్డలకు ఓ వరం...**
- **సీసీ రోడ్డు పనులు ప్రారంభం**
- **ప్రభుత్వ విఫ్, అచ్చంపేట ఎమ్మెల్యే గువ్వల బాలరాజు**

లబ్ధిదారులకు చెక్కులను అందజేస్తున్న ప్రభుత్వ విఫ్, అచ్చంపేట ఎమ్మెల్యే గువ్వల బాలరాజు

వంగూరు, మార్చి 25 ప్రభాతవార్త:నల్లమల్ల ప్రాంత ప్రజలను కంటికి రెప్పల కాపాడుకొని ఈ ప్రాంత అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తానని ప్రభుత్వ విఫ్, అచ్చంపేట ఎమ్మెల్యే గువ్వల బాలరాజు అన్నారు. శనివారం వంగూరు మండల కేంద్రంలోని రైతు వేధిక భవన్‌లో కళ్యాణలక్ష్మి, షాదిముబారక్ చెక్కులను లబ్ధిదారులకు అందించారు. అనంతరం నేషనల్ జాతీయ పంచాయతీ అవార్డులు పొందిన సర్పంచ్‌లను, పంచాయతీ కార్యదర్శులను గువ్వల బాలరాజు శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అచ్చంపేట నియోజకవర్గంలోని ప్రజలకు ఎళ్లవేళలా అందుబాటులో ఉండి కష్ట సుఖాల్లో పాలు పంచుకొని రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలను ప్రతి ఒక్కరికి అందుబాటులోకి తీసుకొచ్చి ప్రజల అభివృద్ధి కోసం కృషి చేయడమే తన లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పేదింటి ఆడబిడ్డలను ఆదుకొని తన ఇంటి మేనమామలాగా ఆడబిడ్డల వివాహాలకు కళ్యాణలక్ష్మి, షాది ముబారక్ పథకాల పేరిట రూ.1,00,116లను అందించి పేదింటి ఆడబిడ్డలకు భరోసా కల్పించి ఆ కుటుంబాలకు అండగా ఉంటున్నారని ఆయన పేర్కొన్నారు. వంగూరు మండలం రంగాపూర్ గ్రామంలో సీసీ రోడ్డు పనులను ఎమ్మెల్యే భూమి పూజ చేసి ప్రారంభించారు. గ్రామానికి చెందిన అలివేలమ్మకు మంజూరైన రూ.20వేలు, లక్ష్మణ్‌కు రూ.24వేల చొప్పున సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఎమ్మెల్యే బాధితులకు అందించారు. కార్యక్రమంలో ఎంపీపీ భీమమ్మ, వైస్ ఎంపీపీ సంధ్యానర్సింహ్మారెడ్డి, సర్పంచ్ అక్కి లావణ్యఎల్లగౌడ్, సింగిల్‌విండో చైర్మన్ కుడుముల సురేందర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మందా రాజేందర్‌రెడ్డి, తహసీల్దార్ రాజునాయక్, జిల్లా కోఆప్షన్ సభ్యులు హామీద్, ఎంపీడీఓ భాస్కర్, మండల అధ్యక్షులు కృష్ణారెడ్డి, నాయకులు దేవా, రాజారంగారావు, గణేష్‌రావు, ఆనంద్‌రెడ్డి, మల్లేష్, శేఖర్, రవి, సలేశ్వరం, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, సెక్రటరిలు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ పంచాయతీ అవార్డులు పొందిన సర్పంచ్, కార్యదర్శులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే

పోలీస్ సిబ్బందికి శిక్షణ కార్యక్రమం..

పోలీస్ సిబ్బందికి శిక్షణ ఇస్తున్నదృశ్యం

నారాయణపేట ప్రతినిధి,మార్చి 25 ప్రభాతవార్త : జిల్లాలోని అన్ని పోలీస్‌స్టేషన్లలోని కోర్టు డ్యూటీ ఆఫీసర్లు ఇతర వర్టికల్ సిబ్బందికి ఎస్‌హెచ్‌ఓ సమక్షంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్‌హెచ్‌ఓ మాట్లాడుతూ కేసుల దర్యాప్తు, ప్రాసిక్యూషన్ విచారణ, (ట్రయల్)లోని సమయంలో కోర్టు డ్యూటీ సమర్థవంతంగా ఇన్వెస్టిగేషన్, ప్రాసిక్యూషన్, సమన్స్ డ్యూటీ ఆఫీసర్, వారంట్ డ్యూటీ ఆఫీసర్లు, కోర్టులోని వివిధ అధికారులను సమన్వయపరుస్తూ సాక్షులు, నిందితులు కోర్టులో హాజరయ్యేలా విధులు నిర్వర్తించి తద్వారా కేసుల విచారణ త్వరితగతిన విజయవంతంగా పూర్తయ్యేందుకు దోహదపడవలెనని కోర్టు డ్యూటీ ఆఫీసర్ సమర్థవంతంగా వ్యవహరించడం వలన నిందితులకు సరైన రీతిలో శిక్షలుపడడానికి దోహదపడిన వారై సకాలంలో బాధితులకు న్యాయం జరిగేందుకు ఆస్కారం కల్పించిన వారు అవుతారని అలాగే పోలీస్ వ్యవస్థపై ప్రజలకు నమ్మకం , గౌరవం పెరగడానికి తమ వంతు పాత్ర విజయవంతంగా నిర్వహించాలని సూచించారు. కోర్టు డ్యూటీ ఆఫీసర్ ఇన్వెస్టిగేషన్ సమయంలో ఎఫ్ఐఆర్ కాపీని ఏ మాత్రం ఆలస్యం చేయకుండా కోర్టులో సమర్పించి తదుపరి కోర్టునకు ఎఫ్ఐఆర్ కాపీ సబ్మిట్ అయింది లేనిది ప్రతిరోజు చెక్ చేసుకుంటూ ఉండాలని, కేసు పురోగతి నివేదికలను పార్ట్ 2 స్టేటమెంట్‌ని సీజ్ చేసిన వస్తువులను ఎప్పటికప్పుడు కోర్టులో సమర్పించాలని సూచించారు. చార్జిషీట్లు, రిమాండ్ నివేదికలను కోర్టులో సమర్పించాలని విచారణ సమయంలో చార్జిషీట్ ఫైల్ చేసిన తర్వాత ఫైల్ వెరిఫై చేసే కోర్టు సిబ్బందికి సహకరించి సిసి నంబర్లు పొందాలని తెలిపారు. కోర్టువారు జారీచేసే నాన్ బెయిలబుల్ వారెంట్లను క్రమం తప్పకుండా తీసుకోవాలని, ప్రతిరోజు కోర్టు నుండి తీసుకునే సమన్లు ప్రాసెస్ రిజిస్టర్‌లో నమోదు చేసి సమాన్స్ ఆఫీసర్లకు అందజేయవలెనని తెలిపారు. ప్రతి శనివారం పోలీస్ స్టేషన్ గల ఎస్‌హెచ్‌ఓ, ఎల్ఓలు, సిబ్బందితో ఆ వారంలో కోర్టులో జరిగిన కేసులలో పడిన శిక్షలు వీగిపోయిన కేసులో లోపాలను చర్చించాలని తెలిపారు.

అభ్యంతరకర పోస్టులు పెట్టిన వారిపై చర్యలు తీసుకోవాలి

విజెఆర్ ఫౌండేషన్ అధినేత వర్కర్స్ జగన్నాథరెడ్డి పదవి లేకుండా స్వచ్ఛందంగా ప్రజల కొరకు పని చేస్తున్న తనపై నిందలా

ఎస్పీకి వినతి పత్రం సమర్పిస్తున్న దృశ్యం

నారాయణపేట ప్రతినిధి,మార్చి25 ప్రభాతవార్త:మక్తల్ నియోజకవర్గంలో విజెఆర్ వర్కటం జగన్నాథ్‌రెడ్డి ఒక ఫౌండేషన్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున గ్రామాలలో తనతో కలిసి వస్తున్న వారితో కలిసి స్వచ్ఛందంగా సేవా కార్యక్రమాలు కొనసాస్తున్నారు. బిఆర్ఎస్ పార్టీ లీడర్‌గా గ్రామాలలో తిరుగుతూ పార్టీలో వివిధ పార్టీల నుండి బిఆర్ఎస్ పార్టీలో చేర్చుకోవడం కొరకు అన్ని విధాలుగా ప్రయత్నం చేస్తున్నానని అన్నారు. తాను రోజు రోజుకు మొత్తం నియోజకవర్గంలో పెద్ద ఎత్తున ప్రజల మన్ననలు పొందుతూ రాబోయే ఎన్నికల్లో ఎక్కడ టిఆర్ఎస్ పార్టీ నుంచి టికెట్ తెచ్చుకునిపోటీ చేస్తాననే భయంతో కొంతమంది తనపై సోషల్ మీడియాలో పిచ్చి పిచ్చి పోస్టులు పెడుతున్నారని అలాంటి వ్యక్తులపై వెంటనే చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ వెంకటేశ్వర్లును కలిసి ఫిర్యాదు చేశారు.

బెదిరింపులకు భయపడేది లేదు... బిఆర్ఎస్ పార్టీ బలోపేతం కోసం పల్లెపల్లె యాత్ర ఆగదని అన్నారు.నిరుపేద ప్రజానీకానికి సహాయం అందించడానికి వెనుకంజ వేసే ప్రసక్తే లేదని బిఆర్ఎస్ పార్టీ సభ్యత్వం ఉందా లేదా అని ఎవరికైనా అనుమానం ఉంటే అధిష్టానం వద్ద తెలుసుకోవాలని అన్నారు. నిరుపేద ప్రజలను ఆర్థికంగా ఆదుకోవడం పాపమా? బిఆర్ఎస్ పార్టీ అభివృద్ధే నా లక్ష్యంతో పల్లెపల్లె యాత్రకు శ్రీకారం పెద్ద ఎత్తున చుట్టబోతున్నానని అన్నారు.

హమాలీ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి సంక్షేమ పథకాలు అమలు చేయాలి..

ఏఓ కి వినతిపత్రం అందజేస్తున్న హమాలీ యూనియన్ నాయకులు

వనపర్తి టౌన్,మార్చి 25 ప్రభాతవార్త: తెలంగాణ ఆల్ హమాలీ వర్కర్స్ ఫెడరేషన్ సీఐటీయు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో హమాలీ కార్మికులకు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేసి సంక్షేమ పథకాలు అమలు చేయాలని కోరుతూ శనివారం పాలకేంద్రం నుండి కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ ఆల్ హమాలీ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు పుట్ట ఆంజనేయులు పాల్గొని మాట్లాడుతూ ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల్లో పనిచేస్తున్న హమాలీ కూలీలందరికి సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి సంక్షేమ పథకాలు అమలు చేయాలని, 55సంవత్సరాలు పైబడిన హమాలీలకు నెలకు రూ.6వేల పెన్షన్ ఇవ్వాలని, ప్రమాదంలో మృతి చెందిన వారికి రూ.10లక్షల నష్టపరిహారం, సహజమరణానికి రూ.5లక్షలు ఇవ్వాలని కోరారు. భవన నిర్మాణ కార్మికుల వలె గుర్తింపు కార్డులు ఇవ్వాలని, అన్ని రకాల హమాలీలకు పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని, కనీస వేతనం గుర్తింపు కార్డులు, రెండు జతల యూనిఫామ్స్ ఇవ్వాలని, ప్రమాద భీమా, ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని అన్నారు.పని ప్రదేశాల్లో హమాలీల కోసం టాయిలెట్లు, విశ్రాంతి గదులు ఏర్పాటు చేయాలని, ఐకెపి, పీఏసీఎస్ కొనుగోలు కేంద్రాల హమాలీలకు ప్రభుత్వమే బిల్లులు చెల్లించాలని అన్నారు. తాడు మామూలు ప్రభుత్వం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం జిల్లా కలెక్టర్ ఏఓ కి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో హమాలీ వర్కర్స్ ఫెడరేషన్ సీఐటీయు అనుబంధ జిల్లా కార్యదర్శి పులేందర్, సీఐటీయు జిల్లా నాయకులు ఎస్.రాములు, నాయకులు ముంత రాములు, నాగోరం రాములు, సత్యన్న, పెంటన్న, నాగన్న, నాగరాజు, శ్రీనివాసులు, మల్లికార్జున్. బీసన్న జిల్లాలోని బజార్ హమాలీలు, తోపుడుబండ్ల కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

కొత్లాబాద్‌లో నివాళులర్పించిన మంత్రి

కోయిల్‌కొండ,మార్చి 25 ప్రభాతవార్త : బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు రాజేంద్రప్రసాద్‌గౌడ్ సోదరుడు వెంకట్రాములు గౌడ్ మృతి చెందగా శనివారం దశదినకర్మకు రాష్ట్ర ఆబ్కారి రాష్ట్ర శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ మండల పరిధిలోని కొత్లాబాద్‌లో హాజరై నివాళులర్పించారు. కార్యక్రమంలో గ్రంథాలయ ఛైర్మన్ రాజేశ్వర్‌గౌడ్, బిఆర్ఎస్ నాయకులు భీంరెడ్డి, రాజవర్ధన్‌రెడ్డి, చారి, నర్సింలు, వెంకటయ్య, ఖాజాపాషా, మహిమూద్, కొండయ్య, దామోదర్‌రెడ్డి పాల్గొన్నారు.

రైతు భీమా ప్రొసిడింగ్ అందజేసిన మంత్రి..

వనపర్తి ప్రతినిధి,మార్చి 25 ప్రభాతవార్త: వనపర్తి నియోజకవర్గంలోని రేవల్లి మండలం చీర్కపల్లి గ్రామానికి చెందిన రైతు బంకల శేషయ్య కుటుంబానికి మంజూరైన రైతు భీమా ప్రొసిడింగ్‌ను వనపర్తి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శేషయ్య భార్య బంకల కురువమ్మకు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి అందజేశారు.

అంత్యక్రియలకు ఆర్థికసాయం అందించిన ఇప్పటూర్ ఎంపిటిసి

నవాబ్‌పేట,మార్చి 25 ప్రభాతవార్త : మండలంలోని ఇప్పటూర్ గ్రామానికి చెందిన నిరుపేద కుటుంబానికి చెందిన వడ్ల బాలమణి (90) మరణించింది. వారి మృతికి సంతాపం తెలిపిన ఇప్పటూర్ నవనీత్ పరామర్శించి రూ. 5116 ఆర్థిక సహాయాన్ని అందించారు. కార్యక్రమంలో దుబ్బరవికిరణ్, వీరన్నారాయణచారి, ప్రకాష్, వెంకటయ్య, జనమయ్య, అరవింద్, కృష్ణయ్య, కమ్మరి శేఖర్, వార్డుమెంబర్ యాదయ్య, ఐకెపి గోపాల్, ఆర్ఎంపి డా. నాయబ్‌బాబా, సూరి తదితరులు పాల్గొన్నారు.

డబుల్ బెడ్‌రూమ్‌ల లొల్లి

గద్వాల ప్రతినిధి,మార్చి 25 ప్రభాతవార్త : జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలో 23,27 వార్డుల్లో ఇండ్ల దరఖాస్తుదారులు ఫీల్డ్ వెరిఫికేషన్ కోసం ఏర్పాటు చేసిన వార్డు సభను బహిష్కరించడం జరిగింది. అర్హులైన వారికి కూడా అనర్హులుగా చెప్పడంతో డబుల్ బెడ్‌రూం గోల మొదలైంది. ఇప్పటికే దరఖాస్తు చేసుకున్న వ్యక్తుల పేర్లలో లబ్దిదారులను తిరస్కరించడం పట్ల అధికారుల దగ్గర స్పష్టమైన సమాచారం లేకపోవడంతో లబ్దిదారులు ఆందోళన వ్యక్తంచేశారు.

ఘనంగా సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి జన్మదిన వేడుకలు

కల్వకుర్తి, మార్చి 25 ప్రభాతవార్త:ఐక్యత ఫౌండేషన్ చైర్మన్, ఎన్ఆర్ఐ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి జన్మదిన వేడుకలను పురస్కరించుకొని ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో కల్వకుర్తిలో ఘనంగా నిర్వహించారు. కల్వకుర్తి పట్టణంలోని ప్రభుత్వాసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. వృద్ధాశ్రమంలో వృద్ధులకు బియ్యం, పండ్లు, నిత్యావసర సరుకులను అందించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు శ్రీపతి రాజు, ఆవ గణేష్, హసన్, షఫీ, శేఖర్, శ్రీనునాయక్, శ్రీకాంత్‌యాదవ్, అభిమానులు తదితరులు ఉన్నారు.

వెల్దండలో...

ఐక్యత ఫౌండేషన్ చైర్మన్, ఎన్ఆర్ఐ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి జన్మదిన వేడుకలు వెల్దండ మండల కేంద్రంలోని ఐక్యత ఫౌండేషన్ కార్యాలయంలో శనివారం పెద్ద ఎత్తున అభిమానులు, కార్యకర్తలు, ఫౌండేషన్ సభ్యులు పాల్గొని రాఘవేందర్‌రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. సందర్భంగా రాఘవేంద

చిరు ధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యం

వెల్దండ, మార్చి 25 ప్రభాతవార్త:చిరు ధాన్యాలైన రాగులు, జొన్నలు, సజ్జలు, కొర్రలతో పాటు ఇతర చిరు ధాన్యాలు తీసుకున్నట్లు అయితే సంపూర్ణ ఆరోగ్యంతో ఉంటారని ఐసీడీఎస్ ప్రాజెక్టు సూపర్‌వైజర్ జ్యోతి అన్నారు. వెల్దండ మండల కేంద్రంలోని కేబీబీవీలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషణ్ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ జ్యోతి మాట్లాడుతూ చిరు ధాన్యాలు తీసుకోవడంతో రక్తహీనతను నివారించవచ్చునన్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఎఎన్ఎం జహంగీర్‌బీ, ఉపాధ్యాయులు లలిత, అన్వరీ, ప్రసన్న, అమారవతి, ఉమా, రేణుక, అంగన్‌వాడీ టీచర్లు మేర్లిన్, మాసమ్మ, శివలీల, మల్లమ్మ, అలివేలు, స్వప్నతో పాటు ఆశా వర్కర్లు యాదమ్మ, పద్మ ఉన్నారు.

అమ్మపాద పూజను దిగ్విజయం చేద్దాం

ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు ఉప్పల వెంకటేష్

వెల్దండ, మార్చి 25 ప్రభాతవార్త:నవమాసాలు మోసి జన్మనిచ్చిన అమ్మకు పాదపూజ చేసి ఆశీర్వచనం పొందుదామని ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు, తలకొండపల్లి జెడ్పీటీసీ ఉప్పల వెంకటేష్ అన్నారు. వెల్దండ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం నిర్వహించే అమ్మ పాద పూజ కార్యక్రమానికి ఏర్పాట్లను పరిశీలించి మాట్లాడారు. ఎన్ని జన్మలెత్తిన అమ్మ రుణం తీర్చుకోలేమని, అమ్మకు పాద పూజ చేసి జన్మ జన్మల ఆశీర్వచనం పొందుదామన్నారు. అమ్మ పాద పూజ కార్యక్రమాన్ని విజయవంతం చేద్దామన్నారు. కార్యక్రమంలో నాయకులు చిత్తరంజన్, జ్యోతయ్య, పూరి రమేష్‌తో పాటు తదితరులు ఉన్నారు.

జిల్లా ఉపాధ్యక్షుడు జువ్వ కృష్ణయ్యకు సన్మానం

వంగూరు, మార్చి 25 ప్రభాతవార్త: నాగర్‌కర్నూల్ జిల్లాలో టీయూడబ్ల్యూజే నూతన కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా నూతన కమిటీలో వంగూరు మండలానికి చెందిన సీనియర్ పాత్రికేయులు, సూర్య దినపత్రిక విలేకరు జువ్వ కృష్ణయ్యను జిల్లా ఉపాధ్యక్షులుగా ఎంపిక చేశారు. ఈ సందర్భంగా శనివారం వంగూరు మండల కేంద్రంలో కళ్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ కార్యక్రమానికి విచ్చేసిన ప్రభుత్వ విఫ్, అచ్చంపేట ఎమ్మెల్యే గువ్వల బాలరాజు జిల్లా ఉపాధ్యక్షులుగా ఎంపికైన జువ్వ కృష్ణయ్యను శాలువాలతో ఘనంగా సన్మానించారు. అనంతరం ఎమ్మెల్యే గువ్వల బాలరాజు మాట్లాడుతూ జువ్వ కృష్ణయ్య సుమారుగా 28 సంవత్సరాలుగా పత్రిక రంగంలో కొనసాగుతూ తెలంగాణ ఉద్యమంలో పత్రిక రంగంతో పాటు తెలంగాణ ఉద్యమానికి ఊపిరి పోస్తూ జేఏసీ కన్వీనర్‌గా పనిచేశారని గుర్తు చేశారు. ముమ్ముందు కూడా భవిష్యత్తులో మరెన్నో పదవులు అధిరోహించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ భీమమ్మ, సింగిల్‌విండో చైర్మన్ సురేందర్‌రెడ్డి, జిల్లా కోఆప్షన్ సభ్యులు హామీద్, వైస్ ఎంపీపీ సంధ్యా నర్సింహ్మారెడ్డి, సర్పంచ్ అక్కి లావణ్య ఎల్లగౌడ్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మందా రాజేందర్‌రెడ్డి, మాజీ మండల అధ్యక్షులు గణేష్‌రావు, నాయకులు లాలుయాదవ్, రాజారంగరావు, దేవా, సలేశ్వరం తదితరులు ఉన్నారు.

నరేంద్రమోడీ దిష్టిబొమ్మ దహనం

వంగూరు, మార్చి 25 ప్రభాతవార్త: రాహుల్‌గాంధీ పార్లమెంట్ సభ్యత్వాన్ని రద్దు చేయడాన్ని ఖండిస్తూ శనివారం వంగూరు మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ప్రధాని నరేంద్రమోడీ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా పలువురు కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ ప్రజాస్వామ్యాన్ని కూని చేస్తూ కేంద్ర ప్రభుత్వం తన ఇష్టానుసారంగా వ్యవహరిస్తూ ప్రతిపక్ష నాయకులపై కక్ష్య సాధింపు చర్యలకు పాల్పడుతూ దేశంలో ప్రజాస్వామ్యాన్ని కూని చేస్తుందని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ నాయకులు పాండురంగారెడ్డి, శివశంకర్, మల్లయ్య, జనార్ధన్, మల్లయ్య,రఫి, ఖయ్యూం, పాండు, మల్లేష్, మొగులయ్య, నాగరాజు, శివాజీ, ఉపేందర్, లింగస్వామి, మహేష్, ప్రభాకర్‌రెడ్డి, గణేష్, బాలయ్య, శ్రీశైలం, కృష్ణ, శంకర్, చంద్రశేఖర్ తదితరులు ఉన్నారు.

మునగాల పంచాయతీకి జాతీయ అవార్డు

ఇటిక్యాల,మార్చి 25 ప్రభాతవార్త : మండల పరిధిలోని మునగాల గ్రామ పంచాయతీకి పేదరికం లేని, మెరుగైన జీవనోపాధి విధానాలపై జాతీయ పంచాయతీ పురస్కార్ అవార్డు దక్కింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో విడుదలవుతున్న నిధుల ద్వారా చేపట్టే అభివృద్ధి కార్యక్రమాలపై పేదరికం లేని, మెరుగైన జీవనోపాధి పంచాయతీగా మునగాల గ్రామం ఎంపిక కావడంతో ఆ గ్రామ సర్పంచ్ కొప్పుల జయలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి ప్రతాప్‌కు జాతీయ పంచాయతీ పురస్కార్ అవార్డును ఎంపిడిఓ రాఘవ, ఎంపిఓ భాస్కర్ యాదవ్ చేతుల మీదుగా సర్పంచ్ జయలక్ష్మి అందుకున్నారు. గ్రామం పురస్కార్ అవార్డుకి ఎంపిక కావడంతో నాయకులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

రాహుల్‌గాంధీపై కక్ష సాధింపు సరికాదు

ఇటిక్యాల, మార్చి 25 ప్రభాతవార్త : కాంగ్రెస్ సగరు నేత ఎంపి రాహుల్‌గాంధిపై అనర్హత వేటువేసి ప్రధాని నరెంద్రమోడీ ప్రభుత్వం కక్షసాధింపు చర్యలకు పాల్పడుతుందని అధికారాన్ని అడ్డుపెట్టుకుని దేశంలో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తుందని మండల కాంగ్రెస్ నాయకుడు పుటాన్‌దొడ్డి మంద జగన్నాథం మండిపడ్డారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంకోసం త్యాగాలు చేసిన కుటుంబానికి చెందిన ఎంపి రాహుల్‌గాంధిని పరువు నష్టం కేసులో ఎంపి పదవికి అనర్హుడిగా ప్రకటించడం హేయమైన చర్యగా ఉందని బిజెపి పార్టీలో కూడా ఎంతో మందిపై వివిధరకాల కేసులు నేర చరిత్ర కేసులు ఉన్నవారు కూడా ఉన్నారని ఎంపి రాహుల్‌గాంధిపై ప్రకటించిన అనర్హత వేటును వెనక్కి తీసుకోవాలని లేదంటే కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఉద్యమాలను చేపడతామని మండల కాంగ్రెస్ పార్టీ నాయకుడు పుటాన్‌దొడ్డి మంద జగన్నాథం హెచ్చరించారు.

పచ్చదనంలో 3వ స్థానంలో ముందరి తండా

పెద్దమందడి,మార్చి 25 ప్రభాతవార్త: దీన్ దయాల్ ఉపాధ్యాయ పంచాయితీ సతాత్ వికాస్ పురస్కార్ అవార్డులో భాగంగా పెద్దమందడి మండలన ముందరి తాండ గ్రామపంచాయితీ పచ్చదనం పరిశుభ్రత లో జిల్లా స్థాయిలో 3వ స్థానం కైవసం చేసుకుంది. ఈ మేరకు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో శనివారం నిర్వహించిన అవార్డుల ప్రధానోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర వ్యవసాయశాక మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి, స్థానిక సర్పంచ్ జయంతి శంకర్ నాయక్, పంచాయితీ కార్యదర్శులకు అవార్డును అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గ్రామాలను అన్ని రంగాల్లో సమిష్టి కృషితో అభివృద్ధి చేసుకోవాలని పిలుపునిచ్చారు. సర్పంచ్ జయంతి మాట్లాడుతూ తమ గ్రామ పంచాయితీని వరించిన ఈ అవార్డు తమ బాద్యతను మరింత గా పెంచిందని ఇంజనీరింగ్ వరకు చదివినప్పటికీ కేవలం ప్రజా సేవ చేసేందుకే రాజకీయాల్లోకి రావడం జరిగిందని గ్రామ ప్రజలు అధికారుల సహాయంతో ముందరి తండాను మరింతగా అభివృద్ధి చేస్తానని ఆమె పేర్కొన్నారు.

గణేష్ ఫౌండేషన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పరీక్ష ప్యాడ్ల పంపిణీ

వీపనగండ్ల,మార్చి 25 ప్రభాతవార్త: ఉమ్మడి వీపనగండ్ల, చిన్నంబావి మండలంలోని వివిధ గ్రామాల జిల్లా పరిషత్ హైస్కూల్‌లో, కస్తూర్బా పాఠశాలలో చదువుతున్న 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు పెద్దమారు గ్రామానికి చెందిన ఎంపీపీ సోమేశ్వరమ్మ అందజేశారు. చిన్నంబావి, వీపనగండ్ల ఉమ్మడి మండల్లాల్లో చదువుతున్న విద్యార్థులకు శనివారం పంపిణీ చేశారు. చిన్నంబావి మండలం పెద్దదగడ గ్రామంలో జిల్లా పరిషత్ పాఠశాలలో సుమారు 334 మంది విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌లు పంపిణీ చేశారు. ట్రస్ట్ నిర్వహకులు ఎంపీపీ సోమేశ్వరమ్మ మాట్లాడుతూ కేవలం ఆర్థికంగా వెనకబడిన విద్యార్థులు మాత్రమే ఎక్కువశాతం ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్నారని ఇలాంటి ట్రస్టు ద్వారా అనేక కార్యక్రమాలు చేపట్టడం జరిగిందని అన్నారు. విద్యార్థులు బాగా చదివి 10/10 జీపీఏ తీసుకురావాలని అన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ వెంకటరమణ, చిన్నారెడ్డి, సింగిల్‌విండో చైర్మెన్ బగ్గరి నరసింహా రెడ్డి, సర్పంచుల సంఘం అధ్యక్షుడు పల్లె మధు, పెద్దదగడ సర్పంచ్ సురేందర్ సింగ్, ఎంపీటీసీ పుష్పలత, అయ్యవారిపల్లి సర్పంచ్ రామస్వామి, ఎంపీటీసీ రాజు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గజ్జల్, ఈదన్న, సీనియర్ నాయకులు ఇంద్ర చెన్నారెడ్డి, ఈశ్వర్ రెడ్డి, లక్ష్మీపల్లి శ్రీధర్ రెడ్డి, శివ రెడ్డి పాల్గొన్నారు.

సమిష్టి కృషితో గ్రామాల అభివృద్ధి

- తెలంగాణను చూసి దేశం ఆశ్చర్యపోతున్నది..
- జిల్లాస్థాయి ఉత్తమ గ్రామ పంచాయతీ పురస్కార సభలో పర్యాటక శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

మహబూబ్‌నగర్ ప్రతినిధి, మార్చి 25, ప్రభాతవార్త : ప్రజాప్రతినిధులు, అధికారుల సమిష్టి కృషితో రాష్ట్రంలో గ్రామాలు అభివృద్ధి దిశగా పయనిస్తున్నాయని, రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి వీ శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. 2023 జాతీయ పంచాయతీ అవార్డుల ప్రదానోత్సవంలో భాగంగా శనివారం మహబూబ్‌నగర్ నూతన కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జిల్లా స్థాయిలో ఉత్తమ పంచాయతీలుగా ఎంపికైన 27పంచాయతీలకు అవార్డులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అన్ని రంగాల్లో తెలంగాణ దేశంలోనే అగ్రగామిగా నిలుస్తున్నదన్నారు. 97శాతం రక్షిత తాగునీరు సరఫరా చేస్తున్నాది తెలంగాణ మాత్రమే అనని, అత్యధిక పచ్చదనం, భూగర్భ జలాలు పెరిగింది తెలంగాణలోనే మన గ్రామాలను చూసి దేశం ఆశ్చర్యపోతున్నది. ఎనిమిదేండ్లలో మన గ్రామాలు ఎంతో మారిపోయాయన్నారు. ఇది చిత్తశుద్ధి ఉన్న ముఖ్యమంత్రి, ప్రభుత్వం ఉండడం వల్లే సాధ్యమైందన్నారు. తెలంగాణలో నూతన జిల్లా కలెక్టరేట్లు జార్ఖండ్ రాష్ట్ర సచివాలయానికి మించి ఉన్నాయన్నారు. మన చేస్తున్న పనికి మనం కేంద్రం నుంచి పొందుతున్న అవార్డులే నిదర్శనమన్నారు. ఉమ్మడి జిల్లాలో కేవలం 4పంచాయతీ ట్రాక్టర్లు ఉండగా నేడు 1400పంచాయతీ ట్రాక్టర్లు ఉన్నాయన్నారు. నేడు ప్రతి పల్లెలో నర్సరీ, వైకుంఠ ధామాలు, సెగ్రిగేషన్ షెడ్లు ఉన్నాయన్నారు. త్వరలోనే రెండో విడుత దళితబంధు కార్యక్రమాన్ని ప్రారంభిస్తామన్నారు. ఉదండాపూర్, కర్వెన కాలువలు పూర్తయితే జిల్లా సస్యశ్యామలం అవుతుందన్నారు. హైదరాబాద్‌కు దీటుగా మహబూబ్‌నగర్‌ను తీర్చిదిద్దుతామన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ రవినాయక్, అదనపు కలెక్టర్ సీతారామారావు, జెడ్పీ వైస్ చైర్మన్ యాదయ్య, డీపీవో వెంకటేశ్వర్లు, జెడ్పీ సీఈవో జ్యోతి, ఆర్డీవో అనిల్‌కుమార్ సర్పంచులు, ఎంపీటీసీలు, కార్యదర్శులు పాల్గొన్నారు.

పల్లెలను అభివృద్ధి చేసినందుకే అవార్డులు

జెడ్పీ చైర్‌పర్సన్ వనజమ్మ,ఎమ్మెల్యే ఎస్ఆర్ రెడ్డి

మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి

నారాయణపేట ప్రతినిధి, మార్చి 25 ప్రభాతవార్త: తమ గ్రామాలను అభివృద్ధి బాటలో నడపించాలని కృతనిశ్చయంతో పని చేసినందుకే నేడు జాతీయ స్థాయి అవార్డులు అందుతున్నాయని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ వనజమ్మ అన్నారు. శనివారం జిల్లా కేంద్రానికి సమీపంలో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌లో జరిగిన జాతీయ పంచాయతీ అవార్డులు 2022 ప్రధానోత్సవానికి జడ్పీ చైర్‌పర్సన్‌తోపాటు జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష, స్థానిక ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. 9 కేటగిరిల్లో ఉత్తమ గ్రామ పంచాయతీ కార్య దర్శులు, పంచాయతీ సిబ్బందికి అవార్డులు, మెమెంటోలు ప్రధానంచేసి సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడు తూ ఇదే స్ఫూర్తిని రానున్న రోజుల్లో కొనసాగించి అన్ని అంశా ల్లో గ్రామాన్ని ఉత్తమంగా నిలిపేవిధంగా కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ ప్రతి గ్రామంలో సమస్యలు ఉంటాయని ఆ సమస్యలను అధిగమించి వివిధ థీమ్‌లలో కష్టపడి తమ గ్రామ అభివృద్ధికి కృషి చేసిన గ్రామ పంచాయతీ బృందానికి అభినందనలు తెలిపారు. 9 కేటగిరిలుగా విభజించి ప్రతి కేటగిరిలో ఉత్తమ ఫలితాలు సాధించిన మొదటి మూడు గ్రామ పంచాయతీలకు మొదటి, ద్వితీయ, తృతీయ స్థానాలు కేటా యించి అవార్డులు ఇవ్వడం జరిగింది. ఎమ్మెల్యే పాల్గొన్న స్థాని క ఎమ్మెల్యే మాట్లాడుతూ సర్పంచ్‌లు, పంచాయతీ సెక్రెటరీలు, సిబ్బంది అహర్నిశలు కృషిచేస్తే ఈ జాతీయ అవార్డులు సాధించారని కొనియాడారు. ఒకప్పుడు సర్పంచ్‌లు ఏ పని లేకుండా ఉండేదని ఏపని జరగాలన్న ఎమ్మెల్యేను వచ్చి అడిగేది అన్నారు. నేడు సర్పంచ్‌లు రాజులయ్యారన్నారు. నేడు సర్పంచ్‌లకు సమాజంలో నిజమైన గౌరవం దక్కుతుందన్నారు. ఈసారి అవార్డులు రానివారు నిరాశపడవద్దని వీరిని స్ఫూర్తిగా తీసుకుని మరింత పట్టుదలతో కృషిచేసి వచ్చే సంవత్సరం ఎక్కువ అవార్డులు సాధించాలని సూచించారు. కోస్గి మండలంలో మొత్తం 8 జాతీయ అవార్డులు సాధించినందుకు ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో జడ్పీ వైస్ చైర్మన్ సూర్యకళ, జడ్పీ సీఈఓ జ్యోతి, పిడి డిఆర్‌డిఓ గోపాల్, డిపిఓ మురళి, ఎంపిపిలు, జడ్పీటిసిలు, సర్పంచ్‌లు, పంచాయతీ సెక్రెటరీలు, గ్రామ సిబ్బంది పాల్గొన్నారు.

సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి

రాహుల్‌గాంధీపై అనర్హత వేటు అప్రజాస్వామికం

కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు జి.మధుసూదన్‌రెడ్డి

మహబూబ్‌నగర్ ప్రతినిధి, మార్చి 25 ప్రభాతవార్త : టీఎస్ పీఎస్సీ పేపర్ లీకేజీ, రాహుల్‌గాంధిపై అనర్హత వేటుపై మహబూబ్‌నగర్ జిల్లా కాంగ్రెస్, ఎన్ఎస్‌యుఐ శ్రేణులు భగ్గుమన్నారు. పేపర్ లీకేజీ, రాహుల్‌గాంధి వారిపై అర్హత వేటును నిరసిస్తూ జిల్లా కేంద్రంలో ఎన్ఎస్‌యుఐ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించి మోడీ, కెసిఆర్ దిష్టిబొమ్మలను దహనం చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కాంగ్రెస్ కార్యాలయం నుండి తెలంగాణ చౌరస్తా వరకు పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జిఎంఆర్ మాట్లాడుతూ కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణ రాష్ట్రంలో ఉద్యోగాల కోసం యువత రోడ్డుమీదకి రావాల్సిన పరిస్థితి ఏర్పడిందని అన్నారు. పేపర్ లీకేజీ ఘటనపై సిట్టింగ్ జడ్జితో విచారణ చేయాలని తెలంగాణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దేశంలో ప్రకటిత ఎమర్జెన్సీ కొనసాగుతుందని రాహుల్‌గాంధిపై అనర్హత వేటు వేయడం అప్రజాస్వామిక చర్యని అన్నారు. అనంతరం ఎన్ఎస్ యుఐ రాష్ట్ర అద్యక్షులు బల్మూరి వెంకట్ మాట్లాడుతూ మంత్రి కెటిఆర్ మీడియా సమావేశం ఏర్పాటు చేసి కేసును తప్పుదోవ పట్టిస్తున్నారని మండిపడ్డారు. కార్యక్రమంలో టిపిసిసి ప్రధాన కార్యదర్శి వినోద్, సంజీవ్ ముదిరాజ్, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు వసంత రాఘవేంద్ర రాజు, జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శులు సిరాజ్ ఖాద్రి, లక్ష్మినారాయణ, టౌన్ కాంగ్రెస్ అధ్యక్షులు లక్ష్మణ్ యాదవ్,జిల్లా కాంగ్రెస్ ప్రచార కార్యదర్శి బెనహర్, జిల్లా ఎస్సీ అధ్యక్షులు సాయిబాబా, ఎన్ఎస్‌యుఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ముకుందం, రమేష్, యూత్ కాంగ్రెస్ అసెంబ్లీ అధ్యక్షులు జె. చంద్రశేఖర్, ఎన్ఎస్‌యుఐ, యూత్ కాంగ్రెస్, కాంగ్రెస్‌ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా గ్రాడ్యుయేషన్ డే

ఇటిక్యాల,మార్చి 25 ప్రభాతవార్త : మండల పరిధిలోని ఎర్రవల్లి చౌరస్తాలో గల సరస్వతి ఇంటర్నేషనల్ పాఠశాలలో శనివారం ఓపెన్ హౌస్, గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ గోవర్ధన్‌రెడ్డి విద్యార్థుల ప్రదర్శనలను తిలకించి మాట్లాడారు. ఈ విద్యా సంవత్సరంలో ఆయా తరగతుల విద్యార్థులు తమ సబ్జెక్టుల్లో నేర్చుకున్న విషయాలను ప్రయోగపూర్వకంగా కార్యక్రమంలో వివరించడం అభినందనీయమన్నారు. పిల్లలో సృజనాత్మకతను వెలికి తీసేందుకు ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయన్నారు. ఆయా తరగతుల విద్యార్థులు తమ ప్రదర్శనలు గురించి తోటి విద్యార్థులకు, తల్లిదండ్రులకు వివరించారు. అనంతరం కిండర్ విద్యను పూర్తి చేసుకున్న విద్యార్థులకు సర్టిఫికెట్లను అందజేశారు. ఈసందర్భంగా విద్యార్థులచే నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, ప్రిన్సిపల్ వెంకటేశ్వర్‌రావు, సంధ్య, నందిని, ఉపాధ్యాయులు పాల్గొన్నారు

జనచైతన్య యాత్రను జయప్రదం చేయండి

అయిజ,మార్చి 25 ప్రభాతవార్త : కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న మతోన్మాద కార్పోరేట్ విధానాలకు వ్యతిరేకంగా సంక్షేమం,మతసామరస్యం, ప్రజాస్వామ్యం, సామాజిక న్యాయం కోసం సిపిఎం తెలంగాణ రాష్ట్ర కమిటి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జనచైతన్య యాత్ర జయప్రదం చేయాలని జిల్లా కార్యదర్శి ఎ. వెంకటస్వామి తెలిపారు. శనివారం పట్టణంలోని సిఐటియు కార్యాలయం వద్ద కార్మికులతో కలిసి జనచైతన్య యాత్ర గోడపత్రికను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిజెపి దేశంలో ప్రజల మధ్య మత విద్వేషాలు రెచ్చగొట్టి దళిత, గిరిజన, మహిళ, మైనార్టీ, బిసిలపై దాడులు చేస్తూ హిందూ ఇతర మతాలపై దాడులు సాగిస్తున్నారని రాజ్యాంగాన్ని పక్కనపెట్టి మనధర్మశాస్త్రాన్ని అమలు చేసేందుకు బిజెపి ఆర్ఎస్ఎస్‌లు ప్రయత్నిస్తున్నారని అన్నారు.కార్యక్రమంలో స్థానిక నాయకులు ఈశ్వర్, శ్రీను, సవారి, నాగరాజు, రాముడు,భీమన్న, తిరుమలేష్ పాల్గొన్నారు.

శివాంజనేయస్వామి ఆలయ ప్రారంభోత్సవం

హాజరైన ఎమ్మెల్యే బండ్ల

ధరూర్,మార్చి 25 ప్రభాతవార్త: మండల పరిధిలోని ఉప్పేర్ గ్రామంలో నూతన శ్రీశ్రీశ్రీ శివాంజనేయస్వామి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి హాజరయ్యారు. గ్రామస్తులు, ఎంపిటిసి ఎమ్మెల్యేకు శాలువా కప్పి పుష్పగుచ్చం ఇచ్చి ఘనంగా స్వాగతం పలికారు. శ్రీశ్రీశ్రీ శివాంజనేయస్వామి నూతన దేవాలయంలో శిలాఫలకాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే దేవాలయంలో ప్రతిష్టించి విగ్రహాలకు ప్రత్యేకపూజలు చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి గ్రామంలో దేవాలయాలు ఉండడం వల్ల ప్రజలలో భక్తి శ్రద్ధలతో దేవునిగ్రామంలో పూజించడం వల్ల శాంతి నెలకొల్పే గ్రామంలో అందరు కలిసి మెలిసి ఉండాలన్నారు. అభివృద్ధికి ప్రతి ఒక్కరు తోడ్పాటు కావాలని, ఆ దైవ అనుగ్రహంతో రాష్ట్రం, గద్వాల, ఉప్పేరు అభివృద్ధి చెందాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నానని తెలిపారు. కార్యక్రమంలో ధరూర్ మండల వైస్ ఎంపిపి సుదర్శన్‌రెడ్డి, ఎంపిటిసి రేణుక, మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు రఘువర్ధన్‌రెడ్డి, అల్లపాడు సర్పంచ్ వీరన్నగౌడ్, బిఆర్ఎస్ పార్టీ నాయకులు కృష్ణారెడ్డి, సర్వారెడ్డి, ప్రభాకర్‌గౌడ్, ప్రభాకర్‌రెడ్డి, హనుమంత్‌రెడ్డి, నరేష్‌గౌడ్, నాయకులు, కార్యకర్తలు, యూత్ సభ్యులు పాల్గొన్నారు.

పాలమూరులో సిట్ జల్లెడ..!

ప్రశ్నాపత్రాల లీక్‌లో 9 మంది నిందితులు ఇక్కడివారే

రూ. 7.50 లక్షలు పెట్టి పేపర్ కొన్నట్లు వెలుగులోకి..

నవాబ్‌పేట, మార్చి 25 ప్రభాతవార్త : టీఎస్‌పీఎస్సీ ప్రశ్నాపత్రాల లీకేజీ రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టిస్తోంది. తొలుత పట్టుబడిన 9 మంది నిందితుల్లో 6 మంది ఉమ్మడి పాలమూరుకు చెందిన వారే ఉండడంతో సిట్‌బృందం ఇక్కడ జల్లెడ పడుతుంది. నిందితుల విచారణలో వెలుగు చూసిన సమాచారం ఆధారంగా శుక్రవారం మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల నియోజకవర్గ పరిధిలోని నవాబ్‌పేటలో ఈజిఎస్‌లో పని చేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగి ప్రశాంత్‌రెడ్డిని అదుపులోకి తీసుకుని ప్రశ్నించింది. ప్రశాంత్ ఇటీవల జరిగిన ఏఈ(సివిల్) పరీక్షతో పాటు గ్రూప్ 1 ప్రిలిమ్స్ కూడా రాసినట్లు సమాచారం. ఏఈ పరీక్షకు సంబంధించి ఇతను అక్రమాలకు పాల్పడినట్లు సిట్ నిర్ధారణకు వచ్చినట్లు తెలిసింది. లీక్ అయిన పేపర్‌ను అతను రూ. 7.50 లక్షలు పెట్టి కొనుగోలు చేసినట్లు సమాచారం. ఆర్‌టిజిఎస్, ఫోన్‌పే, గూగుల్ పే తదితరాల ద్వారా ఇప్పటికే అదుపులో ఉన్న ఓ నిందితుడికి డబ్బులు పంపినట్లు గుర్తించారు. ఏఈ పరీక్ష రాసిన మరో ముగ్గురు పాలమూరు పరిధిలోని షాద్‌నగర్‌కు చెం దిన ఓ వ్యక్తి, మరో ఇద్దరు కూడా ఏఈ పరీక్ష రాసినట్లు తెలి సింది. మొత్తం రూ.30 లక్షల వరకు చేతులు మారినట్లు తెలు స్తోంది. దీనిపై నవాబ్‌పేట పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం రాత్రి 11గంటల వరకు విచారణ కొనసాగింది. ప్రశాంత్‌రెడ్డి ఇంకా ఎవ రికైనా పేపర్‌ను విక్రయించాడా అనే కోణంలో సిట్ ఆరా తీస్తుంది.

ఉత్తమ పంచాయతీలకు అవార్డులు

గండీడ్,మార్చి 25 ప్రభాతవార్త : మహబూబ్‌నగర్ కలెక్టరేట్‌లో జరిగిన జిల్లా ఉత్తమ గ్రామ పంచాయతీలుగా ఉమ్మడి గండీడ్ మండలంలోని మంగంపేట తండా, మనసుంపల్లి తండాలకు మంత్రి శ్రీనివాస్‌గౌడ్ శనివారం అవార్డులు అందజేశారు. అవార్డులు అందుకున్న వారిలో మంగంపేటతండా, మనసుంపల్లి తండాలకు అవార్డులు అందజేశారు. అవార్డులు అందజేసిన వారిలో ఎమ్మెల్యే ఆలవెంకటేశ్వర్‌రెడ్డి, జిల్లా కలెక్టర్, అడిషనల్ కలెక్టర్, సీఈఓ , సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, ఎంపిపి మాధవి రాజ్‌కుమార్‌రెడ్డి, జడ్పీటిసి శ్రీనివాస్‌రెడ్డి, ఎంపిడిఓ ఉపేందర్‌రెడ్డి, ఎంపిఓ శంకర్‌నాయక్, సర్పంచ్‌గా సంఘం అధ్యక్షుడు గోపాల్, రాజ్‌కుమార్‌రెడ్డి, టిఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

ఉత్తమ పంచాయతీగా అచ్చాయపల్లి..

మూసాపేట,మార్చి 25 ప్రభాతవార్త : జిల్లాస్థాయి ఉత్తమ గ్రామ పంచాయతీ అవార్డును జిల్లా కలెక్టర్ కార్యాలయంలో శనివారం కలెక్టర్ రవి, మంత్రి శ్రీనివాస్‌గౌడ్, ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డిల చేతులమీదుగా అచ్చాయపల్లి గ్రామ సర్పంచ్ చంద్రశేఖర్, పంచాయతీ కార్యదర్శి మహెందర్ అందుకున్నారు. కార్యక్రమంలో ఎంపిడిఓ స్వరూప, ఎంపిఓ సరోజ, గ్రామ వార్డు మెంబర్లు పాల్గొన్నారు.

స్ప్రింకర్ల అందజేత..

కొత్తకోట,మార్చి 25 ప్రభాతవార్త: మండల పరిధిలోని కనిమెట్ట గ్రామంలో రైతులకు స్ప్రింకర్లను శనివారం ఎంపీపీ గ